## హమాస్‌కు కిమ్ ఆయుధాలు!

జెరూసలేం : ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడికి పాల్పడ్డ హమాస్ ఉగ్రవాదులు ఉత్తర కొరియా ఆయుధాలను వాడుతున్నారా? కిమ్ ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలకు ఆయుధా లను సరఫరా చేస్తోందా? ఈ ప్రశ్నలకు ఆర్మమెంట్ రిసెర్చ్ సర్వీసెస్ నిపుణులు, దక్షిణ కొరియా అధికారులు ఔననే చెబుతు న్నారు. ఈ నెల 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడికి దిగినప్పుడు.. పెద్ద ఎత్తున రాకెట్లను ప్రయోగించడంతోపాటు.. గ్రనేడ్ లాంచర్లను వినియోగించారని వీడియోలు, ఫొటోల ద్వారా నిర్ధారణ అయ్యింది. అయితే.. ఉగ్రవాదులు వాడిన రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్ లాంచర్లు ఉత్తర కొరియా తయారు చేసిన ఎఫ్-7 రకానికి చెందినవని నిపుణులు చెబుతున్నారు.

Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 272 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 అక్టోబర్ 2023 శనివారం పేజీలు : 4



# పట్టాలెక్కి పరుగులు తీసిన 'నమో భారత్'

## జెండా ఊపి, రైల్లో ప్రయాణించిన మోదీ

గాజియాబాద్: దేశీయ తొలి ప్రాంతీయ సెమీ హైస్పీడ్ రైలు 'నమో భారత్' పట్టాలపై పరుగులుపెట్టింది. ఉత్తరప్రదేశ్ లోని సాహిబాబాద్ స్టేషన్‌లో దిల్లీ-గాజియాబాద్-మేరఠ్ రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తొలి ర్యాపిడ్ఎక్స్ రైలుకు ప్రధాని జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తదితరులు పాల్గొన్నారు. రైలును ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ అందులో ప్రయాణించారు. స్కూల్ విద్యార్థులు, ర్యాపిడ్ఎక్స్ రైలు సిబ్బందితో ముచ్చటించారు. గంటకు 180 కి.మీ.గరిష్ఠ వేగంతో దూసుకెళ్లేలా తీర్చిదిద్దిన ఈ రైలులో అధునాతన సదుపాయాలు ఉంటాయి. దిల్లీ- గాజియాబాద్- మేరఠ్ మధ్య రూ.30,000 కోట్లతో చేపట్టిన 'ప్రాంతీయ శీఘ్ర రవాణా వ్యవస్థ' (రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్) కారిడార్‌లో సాహిబాబాద్-దుహై డిపో మధ్య ముందుగా 17 కి.మీ. దూరానికి ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది. ఈ రెండింటి మధ్య అయిదు స్టేషన్లు ఉంటాయి.

**పూర్తిగా ఏసీ పెట్టెలే :** నమోభారత్ రైళ్లలో అన్నీ ఏసీ పెట్టెలే ఉంటాయి. ప్రతి రైలులో 2ం2 తరహాలో సీట్లు ఉంటాయి. నిలబడేందుకు విశాలమైన ప్రదేశం, సామాన్లు ఉంచేందుకు అరలు, సీసీటీవీ కెమెరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, లాప్‌టాప్/మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, రూట్‌మ్యాప్‌లు, దానంతట అదే నియంత్రించుకునే లైటింగ్ వ్యవస్థ ఉంటాయి. ఈ రైళ్లు ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు సేవలందిస్తాయి. పావుగంటకు ఒకటి చొప్పున నడుస్తాయి. తర్వాత అవసరాన్ని బట్టి అయిదు నిమిషాలకొకటి నడుపుతారు. ప్రతి రైలులో ఆరు కోచ్‌లు ఉంటాయి. ప్రామాణిక కోచ్‌లలో 72, ప్రీమియం తరగతిలో 62 సీట్లు చొప్పున ఉంటాయి. నిల్చొని ప్రయాణించేవారితో కలిపి ఏకకాలంలో 1,700 మంది వీటిలో వెళ్లవచ్చు. ప్రామాణిక కోచ్‌లలో టికెట్ ధర రూ.20-50 మధ్య, ప్రీమియం కోచ్‌లలో రూ.40-100 మధ్య ఉంటుంది. ప్రతి రైలులో ఒక కోచ్‌ను మహిళలకు కేటాయించారు. మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రతి కోచ్‌లోనూ కొన్నిసీట్లను కేటాయించారు. ప్రీమియం కోచ్‌లలో వెనుకకు వాలి కూర్చొనేలా సీట్ల అమరిక ఉంటుంది. కోటు, పుస్తకాలు వంటివి తగిలించుకునే ఏర్పాట్లు చేశారు. ఫుట్‌రెస్ట్‌లు ఉంటాయి. ప్రీమియం కోచ్‌లో ప్రయాణికులకు సహాయపడేందుకు ఒకరు అందుబాటులో ఉంటారు. ఎనిమిది ఆర్ఆర్‌టీఎస్ కారిడార్లకు గానూ ముందుగా మూడింటిని ప్రాధాన్య ప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు.



## సుప్రీంలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ




ఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార బీఆర్ఎస్ పార్టీకి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పిటిషన్ ధర్మాసనం కొట్టేసింది.

ఓటర్లకు అన్నీ తెలుసని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీంతో బీఆర్ఎస్‌కు ఊహించని షాక్ తగిలినట్టయ్యింది. సుప్రీం నిర్ణయంతో బీఆర్ఎస్ అధిష్టానం, ఆ పార్టీ అభ్యర్థులు ఆలోచనలో పడినట్లు తెలిసింది.

**సుప్రీం సీరియస్..** 'భారతీయ ఓటర్లు రాజకీయ నిరక్షరాసులు కాదు. ఓటర్లకు కారు, చపాతి రోలర్, రోడ్డు రోలర్ తేడా తెలియదు అనుకుంటున్నారా?.. ఎన్నికలు వాయిదా వేయాలని మీరు కోరుకుంటున్నారా? హైకోర్టు తీర్పు తర్వాత దాదాపు 240 రోజుల తర్వాత సుప్రీంకోర్టుకు రావడం ఏంటి?. అధికార పార్టీగా ఉన్న మీకు ఈ విషయం తెలియదా?' అంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయవాదులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

**అసలేం జరిగింది..?** కాగా.. కారును పోలిన గుర్తులను తొలగించాలంటూ న్యాయస్థానంలో బీఆర్ఎస్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. చపాతీ రోలర్, రోడ్డు రోలర్, తదితర గుర్తులను ఎన్నికల్లో ఎవరికీ కేటాయించకుండా ఎన్నికల సంఘానికి ఆదేశించాలంటూ బీఆర్ఎస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మునుగోడు ఉప ఎన్నికలో కారును పోలిన గుర్తులతో నష్టపోయామని పిటిషన్‌లో పేర్కొంది. విచారణ చేపట్టిన ధర్మాసనం బీఆర్ఎస్ పిటిషన్‌ను కొట్టేసింది. ఓటర్లకు అన్ని విషయాలు తెలుసని కోర్టు వ్యాఖ్యానించింది.

## సింగరేణి కార్మికులకు దసరా బొనాంజా
## ఒక్కో కార్మికుడికి రూ.1.53లక్షలు



హైదరాబాద్: సింగరేణి కార్మికులకు బోనస్ కింద తెలంగాణ ప్రభుత్వం రూ.711 కోట్లు విడుదల చేసింది. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.1.53లక్షల బోనస్ ఇవ్వనున్నట్టు యాజమాన్యం వెల్లడించింది.

ఈ నిర్ణయంతో సింగరేణిలో పనిచేస్తున్న 42వేల మంది కార్మికులకు రూ.1.53లక్షల చొప్పున బోనస్ అందనుంది. ఒకటి రెండు రోజుల్లో పండుగ అడ్వాన్స్ కూడా చెల్లించనున్నట్టు అధికారులు తెలిపారు.

# ఆ మూడు పార్టీల మధ్య చీకటి ఒప్పందం

## కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు

## కాంగ్రెస్ విజయభేరి యాత్రలో రాహుల్ గాంధీ







జగిత్యాల: దొరల తెలంగాణకు.. ప్రజా తెలంగాణకు మధ్య జరుగుతున్న ఎన్నికలని.. తెలంగాణ వచ్చినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని.. తెలంగాణలో రాచరిక పాలన సాగుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ విజయభేరి యాత్రలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆయన జగిత్యాలలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మూతపడ్డ చక్కెర కర్మాగారాలను పునఃప్రారంభించి రైతులను ఆదుకుంటామని స్పష్టం చేశారు. క్వింటా పసుపుకు రూ.12వేలు ధర కల్పిస్తామన్నారు. తెలంగాణ ప్రజలతో తనకున్నది రాజకీయ బంధం కాదని.. ప్రేమానుబంధమని.. ఈ అనుబంధం ఈనాటిది కాదని... నెహ్రూ, ఇందిరమ్మ నుంచి కొనసాగుతోందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఈ మూడు పార్టీలు ఒక్కటేనని, వీరిమధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీకి, బీఆర్ఎస్... రాష్ట్రంలో బీజేపీకి బీఆర్ఎస్, ఎంఐఎం సహకరించుకుంటున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. తాను బీజేపీపై పోరాటం చేస్తుంటే... తనపై కేసులు పెట్టారని, లోక్ సభ సభ్యత్వం రద్దు చేశారని.. తనను ఇంటి నుంచి బయటకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇల్లు భారత ప్రజలని.. తెలంగాణ ప్రజల హృదయాల్లో ఉందని, తనను ఇంటి నుంచి బయటకు పంపించగలరేమో.. కానీ ప్రజల హృదయాల్లోంచి కాదని అన్నారు. కులగణనపై పార్లమెంటులో డిమాండ్ చేశానని, ప్రధాని మోదీ తన ప్రశ్నకు జవాబు చెప్పలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కులగణనకు ముందుకు రావడంలేదని, కులగణన అటు మోదీకి.. ఇటు కేసీఆర్‌కు ఇష్టంలేదని అన్నారు. కేసీఆర్ సర్కార్‌పై ప్రజలు విరక్తి చెంది ఉన్నారని, ఈ సారి కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారన్నారు. దేశ బడ్జెట్ కేటాయింపులో ఐఏఎస్‌లది కీలక పాత్రని.. అలాంటి అధికారుల్లో 90 శాతం అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారన్నారు. అందుకే కులగణన చేస్తేనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని రాహుల్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ సంపదను ప్రధాని మోదీ ఆదానీకి కట్టబెడుతున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపడతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే.. ఇక్కడ కూడా బీసీ కులగణన చేపడతామన్నారు. కులగణన ఎక్స్ రే లాంటిదని, కులగణన జరిగితేనే బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, అడవిలో సింహాలు ఒంటరిగా కనిపిస్తాయని, కానీ తెలంగాణ కాంగ్రెస్‌లో చాలా పులులు కలిసికట్టుగా బీఆరెస్‌తో పోరాడుతున్నాయని, ఇక కేసీఆర్ ఆటకట్టించడం ఖాయమని రాహుల్ గాంధీ అన్నారు.

# సంపాదకీయం

## షర్మిల డెసిషన్...రాజకీయ మరణ శాసనమేనా...?

తెలంగాణాలో పార్టీ పెట్టి మూడేళ్ళుగా లాక్కువచ్చిన వైఎస్ షర్మిల వ్యూహాలు లేక చివరికి చతికిలపడుతున్నారా అన్న చర్చ సాగుతోంది. ఆమె తన చేతిలో ఉన్న అవ్షన్లను సరిగ్గా వాడుకోలేదా అన్న మాట కూడా ఉందిపుడు. ఎందుకంటే కాంగ్రెస్ ఇపుడు పైకి లేస్తున్న కడలి కెరటంగా ఉంది. ఆ పార్టీతో షర్మిల పార్టీ విలీనం ఆమె సుదీర్ఘ రాజకీయ జీవితానికి బాటలు వేసి ఉండేది. అయితే కాంగ్రెస్ లాంటి అతి పెద్ద జాతీయ పార్టీకి షర్మిల కండిషన్లు పెట్టారని అంటున్నారు. తాను తెలంగాణా దాటి పాలిటిక్స్ చేయనని పాలేరు నుంచి పోటీ చేస్తానని ఆమె చెప్పడంతోనే కాంగ్రెస్ తో వైఎస్సార్టీపీ విలీనం చివరి నిముషంలో నిలిచిపోయింది అని అంటున్నారు. ఇక రేపో మాపో విలీనం అంటూ షర్మిల ఎన్నికల ముందు విలువైన కాలం అంతా వేస్ట్ చేశారు అని అంటున్నారు. కాంగ్రెస్ హై కమాండ్ అయితే ఆమెను వైఎస్సార్ తనయగా గుర్తించింది. ఆమె సేవలను ఏపీ కాంగ్రెస్ కి వాడుకోవాలని కూడా ప్రతిపాదించింది. ఎందుకంటే కాంగ్రెస్ కి తెలంగాణాలో నేతలు చాలా మంది ఉన్నారు. పార్టీ పటిష్టంగా ఉంది. ఏమీ లేని చోటనే కదా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని వాడుకునేది. అలా కనుక ఆలోచిస్తే షర్మిలని కాంగ్రెస్ కేవలం ఏపీ కోసమే తీసుకుంది. ఎంత కాదన్నా వైఎస్ షర్మిల రాజకీయ మూలాలు ఏపీలోనే ఉన్నాయి. ఆమె తండ్రి పేరుతో రాజకీయం చేస్తున్నారు కాబట్టి కార్యక్షేత్రం ఏపీ అయితేనే ఆమెకు మేలు ఆమె వల్ల కాంగ్రెస్ కి మేలు అని హస్తం పార్టీ నేతలు తలచారు. ఇందుకు గానూ ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని కూడా ప్రతిపాదించారు. కానీ షర్మిల మాత్రం ససేమిరా అనేశారు. తాను తెలంగాణా నుంచి రాజకీయం చేస్తాను అన్నారు. ఫలితంగా విలీనం లేకుండా పోయింది. ఇక ఎన్నికలు గట్టిగా నెలన్నరకు వచ్చాయనగా ఏకంగా 119 మంది అభ్యర్ధులను పెట్టి పోటీకి ఒంటరిగా దిగుతామని షర్మిల ప్రకటించడం ఏకంగా ఆమె రాజకీయ జీవితానికే మరణ శాసనం అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఎక్కడ చూసినా ఒక్క షర్మిల తప్ప సీరియస్ గా కంటెస్ట్ చేసే అభ్యర్ధులు అయితే ఆమె పార్టీకి లేరు. ఇక షర్మిల విషయమే తీసుకుంటే పాలేరు నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారు. ఆయన బిగ్ షాట్ గా ఉన్నారు. అలాగే బీయారెస్ నుంచి కందుల ఉపేందర్ రెడ్డి బరిలో ఉంటున్నారు. ఈ ఇద్దరి మధ్య హోరా హోరీ పోరు సాగనుంది. మధ్యలో షర్మిల నిలబడితే గెలుపు ఆశలు పక్కన పెట్టి కనీసం డిపాజిట్లు వస్తాయా అన్న చర్చ సాగుతోంది. తాను ఓడిపోయి అది కూడా దారుణమైన ఓటమి అయితే షర్మిల ఏమి సాధించినట్లు అని కూడా అంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో గెలుపు ఒక్కటే ప్రమాణం. షర్మిల ఏ మహిళా చేయని సాహసం చేశారు. ఏకంగా 3,800 కిలోమీటర్ల దూరం నడచారు. అదే టైం లో ఆమె పార్టీని పటిష్టం చేసుకోలేక పోయారు. ఇక కాంగ్రెస్ లో విలీనం అంటూ సొంత పార్టీలో ఉన్న వారిలోనూ అనుమానాలు రేకెత్తించారు. సమయం కుదిరి అనుకున్న కండిషన్లకు ఓకే అంటే ఆమె పార్టీ విలీనం అయ్యేదన్న చర్చ అయితే ఉంది. ఇక మొత్తం 119 సీట్లు అని కాదు కనీసం పది నుంచి పదిహేను సీట్ల మీద అయినా ఫోకస్ పెట్టి ఉంటే ఎంతో కొంత బెటర్ గా ఉండేది అని అంటున్నారు. అలాగే కాంగ్రెస్ కాకపోయినా వేరే పార్టీలతో అయినా పొత్తు పెట్టుకుని బరిలోకి దిగినా అర్ధం ఉండేది అంటున్నారు. ఏమీ కాకుండా సింగిల్ గా పోటీ అంటూ ఆమె దిగితే ఏమి సాధిస్తారు అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఆమె కనుక ఓటమి పాలు అయితే రేపటి రోజున అంటే డిసెంబర్ 3 రిజల్ట్స్ తరువాత వైఎస్సార్టీపీ మనుగడ ప్రశ్నార్ధకం అవుతుందని కూడా అంటున్నారు. మరి షర్మిల డేరింగ్ ఏంటి అన్నది కూడా అందరి మదిలో మెదిలే ప్రశ్న ఇపుడు.

## అభాగ్యులం.. ఆదుకోరూ..!



ఖమ్మం : కనీసం నడవలేని స్థితిలో తల్లి ఒకవైపు.. మానసిక దివ్యాంగుడైన కుమారుడు మరోవైపు. ఇది చాలదన్నట్లు తనకు తీవ్ర అనారోగ్య సమస్యలు.. అయినా తానే వారిద్దరికీ పెద్ద దిక్కు. ఇక వర్షం వస్తే లోతట్టున ఉన్న ఇంటికి వరద ముంచెత్తోంది. ఇలా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దర్భర జీవనం గడుపుతోంది ఓ కుటుంబం. ఇది ఓ తల్లీ, కూతురు, ఆమె కొడుకు దయనీయ గాథ. తల్లి, కుమారుడికి అన్నీ తానవుతూ..

చింతకాని మండలం నాగిలిగొండకు చెందిన 85 ఏళ్ల సంపసాల ముత్తమ్మ, ఆమె కుమార్తె పిచ్చమ్మ, పిచ్చమ్మ కుమారుడు ఎల్లయ్య గత కొన్నేళ్లుగా రేకుల ఇంట్లో నివసిస్తున్నారు. ముత్తమ్మ భర్త నారాయణ ఇరవై ఏళ్ల క్రితం మరణించాడు. ఆమె పదిహేనేళ్ల క్రితం ప్రమాదానికి గురవ్వటంతో కనీసం నడవలేని పరిస్థితిలో దేకుతూ ఇంట్లో అటూ, ఇటూ కదులుతోంది. ఆధార్ కార్డు నమోదుకు సైతం వేలిముద్రలు సరిగ్గా పడకపోవటంతో పింఛను కూడా రావటం లేదు. ఇక ఆమె కుమారుడు ముత్తమ్మను పట్టించుకోకుండా ఎటో వెళ్లిపోయాడు. కూతురు పిచ్చమ్మను భర్త వదిలేయటంతో పదిహేనేళ్లుగా తల్లి వద్దే మానసిక దివ్యాంగుడైన కుమారుడు ఎల్లయ్యతో కలిసి ఉంటోంది. పిచ్చమ్మకు వచ్చే వృద్ధాప్య పింఛన్, దివ్యాంగుడైన ఎల్లయ్యకు అందుతున్న ఆసరా పింఛన్‌పైనే ముగ్గురు జీవించాల్సిన దుస్థితి. పిచ్చమ్మకు ఇటీవల అనారోగ్య సమస్య తలెత్తింది. ఆరోగ్య పరిస్థితి బాగోలేదనీ ఆమె పేర్కొంది. ప్రస్తుతం తల్లి ముత్తమ్మ, కుమారుడు ఎల్లయ్యలను పిచ్చమ్మ కంటికి రెప్పలా కాపాడుతూ పోషిస్తోంది. కనీసం వారుండేందుకు ఇల్లు కూడా సరిగా లేదు. కేవలం నాలుగు మూలలు పరదా పట్టాలు కట్టిన తాత్కాలిక రేకుల షెడ్డులో గత కొన్నేళ్లుగా నివాసముంటున్నారు. వర్షం కురిసినప్పుడు తమ ఇల్లు లోతట్టున ఉండటంతో ఇంట్లోకే నీరు వస్తోందని వారు వాపోతున్నారు. నెలనెలా ఇద్దరికీ వచ్చే ఆసరా పింఛన్ ముగ్గురికి మందులకే సరిపోతున్నాయనీ.. కనీసం తిండికి కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని పిచ్చమ్మ కన్నీరుమున్నీరవుతోంది. తమ రేకుల గదికి కనీసం విద్యుత్తు, మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేదు. అధికారులు స్పందించి ఆధార్‌కార్డు ఇప్పించటతోపాటు నెల నెలా ఆసరా పింఛన్ ఇప్పించాలని ముత్తమ్మ వేడుకుంటోంది. దాతలు స్పందించి ఓ గది నిర్మించి ఇవ్వాలని ముగ్గురూ అర్థిస్తున్నారు.

దాతలు సంప్రదించాల్సిన నెంబర్: 9394450050

## ఆలయాల భూములపై ప్రైవేటు పెత్తనం




వరంగల్ : 'కోట్ల రూపాయల విలువ చేసే దేవాలయాల భూములపై ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన భూములను రాత్రికి రాత్రే తొలగించేస్తున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పలు ఆలయాల స్థలాలు సొంతం చేసుకునే పనిలో ఉన్నారు. కార్యనిర్వహణాధికారులు(ఈవో)ను లెక్క చేయడం లేదు. విలువైన స్థలాలపై వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. హనుమకొండ పద్మాక్షి, వీరపిచ్చమాంబ, సిద్దేశ్వరస్వామి, వరంగల్ వేణుగోపాలస్వామి దేవాలయాల భూముల ఆక్రమణలపై లోకాయుక్త న్యాయస్థానం సీరియస్‌గా ఉంది. వచ్చే జూన్ మొదటి వారం కల్లా సమగ్ర సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. హనుమకొండలో నాలుగు ఆలయాలకు చెందిన సుమారు 21.16 ఎకరాల భూమి ప్రైవేటు చెరలో ఉన్నాయని జిల్లా దేవాదాయ శాఖాధికారులంటున్నారు. క్షేత్రస్థాయిలో చర్యలకు వెనుకంజ వేస్తున్నారు.'ఇవిగో ఉదాహరణలు.. హనుమకొండ పద్మాక్షి దేవాలయానికి చెందిన స్థలాల్లో రెండు, మూడు నెలల క్రితం బోర్డులు ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో రాత్రికి రాత్రి తొలగించేశారు. సుమారు 2.16 ఎకరాల్లో ప్రైవేటు నిర్మాణాలున్నాయి. వీరపిచ్చమాంబ ఆశ్రమానికి చెందిన స్థలాల్లో బోర్డులు పెట్టకుండా ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారు. రాజకీయ పలుకుబడితో పెత్తనం చెలాయిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన స్థలాలు ఆక్రమించేశారు. హనుమకొండ శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం భూముల లెక్క తేలడం లేదు. రెవెన్యూ శాఖాధికారులు సమగ్ర సర్వే చేపట్టడం లేదు. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపట్టారు. బోర్డులు కనిపించడం లేదు. హనుమకొండ పెద్దమ్మగడ్డ శివారు కాకతీయ కెనాల్ సమీపంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం(చిన్న కోవెల) భూములపై కన్ను పడింది. రెండు నెలల క్రితం తాత్కాలిక గుడిసెలు తొలగించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన బోర్డులు తరచూ తొలగిస్తున్నారు. వరంగల్ పాపయ్యపేట శ్రీమల్లికార్జునస్వామి(కుంటి భద్రయ్య గుడి) దేవస్థానం భూములు అన్యాక్రాంతమయ్యాయి. పేదలు గుడిసెలు వేసుకున్నారు. మిగిలిన ఖాళీ స్థలాలను గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బోర్డులు తొలగించేశారు.

వరంగల్ బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు తిష్ట వేశారు. ఇంత వరకు బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. వరంగల్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన విలువైన స్థలంపై ప్రైవేటు వ్యక్తుల కన్ను పడింది. గత కొన్నేళ్లుగా లీజు పేరుతో దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

రంగశాయిపేట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వ్యవసాయ భూములున్నాయి. కౌలు పేరుతో ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. బోర్డులు పెట్టాలి – ఆర్.సునీత, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లారాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవాలయాల భూములపై సర్వే, క్షేత్రస్థాయిలో బోర్డులు పెట్టడం జరిగింది. బోర్డులు తొలగిస్తున్న వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సర్వే పూర్తయ్యాక హద్దులు ఖరారు చేస్తాం. బోర్డులు ఏర్పాటు చేస్తాం.

## పడిపోతున్న మొక్కజొన్న ధరలు

వరంగల్ : మొక్కజొన్నల ధర తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత (మార్చి) నెలలో మక్కలు క్వింటాకు రూ.2,300 ధర పలికింది. పంట చేతికి వస్తున్న క్రమంలో రోజు రోజుకు ధరలు పడిపోయి నష్టాన్ని కలిగిస్తోంది. జిల్లాలో రబీలో సాగు 65,756 ఎకరాలు కాగా ఈఏడాది 88,415 ఎకరాల్లో వేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం క్వింటాకు రూ.1,962ల మద్దతు ధరను నిర్ణయించింది. ఈ నెల మొదటి వారం దాకా రూ.2వేల నుంచి రూ.2,100 పలికిన ధర ఈ నెల 9 నుంచి క్రమేపి తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం నర్సంపేట మార్కెట్‌లో క్వింటాకు రూ.1500 నుంచి రూ.1850లకు కొనుగోలు జరుపుతున్నారు. మార్కెట్‌లో ధర తగ్గడానికి వ్యాపారులు కూటమిగా ఏర్పడడమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాకులతో కొర్రీలు.. : గ్రామాల నుంచి పెద్దమొత్తంలో మక్కలు రావడంతో మార్కెట్ కళకళలాడుతోంది. వ్యాపారులు తేమ, నాపలు(నాసిరకంగా) అంటూ కుంటి సాకులు చెబుతూ ధరలో కోత పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సుల్లేని కొందరు చిల్లర వ్యాపారులు గ్రామాల్లో కళ్లాల, పంట చేన్ల వద్దే ఎలాంటి ఖర్చు లేకుండా క్వింటాకు రూ.1700 నుంచి రూ.1800లకు కొంటూ శఠగోపం పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెట్ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

నష్టాలే మిగిలాయి..: పెరిగిన ఎరువుల ధరలు, కూలీ రేట్లు, దున్నుడు ఖర్చులకు తోడు వడగళ్ల వర్షం చుట్టుముట్టాయి. తెగుళ్లు, చీడపీడలతో ముప్పిరిగొన్న పంటను మార్కెట్‌కు తీసుకువస్తే మద్దతు మాటేమోగాని గిట్టుబాటు ధర రాకపోవడంతో ఖిన్నులవుతున్నారు. క్వింటా మక్కలకు డీఏపీ బస్తా ధర రావడం లేదని వాపోయారు. ఎకరాకు రూ.20–25వేలు పెట్టుబడి ఖర్చు వచ్చిందని కొమురయ్య అనే రైతు వివరించారు.

జాడలేని కొనుగోలు కేంద్రాలు..: రైతులు పండించిన మక్కలకు మద్దతు ధర లభించకుంటే మార్క్‌ఫెడ్ అధికారులు రంగంలోకి దిగి మద్దతు ధరకు కొనుగోలు చేసి అండగా నిలవాల్సి ఉంది. గత పది రోజుల నుంచి రోజు రోజుకు మార్కెట్‌లో మక్కల ధర పడిపోతున్నా అధికారులు కొనుగోలు కేంద్రాలను నెలకొల్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఏర్పాట్లు చేస్తున్నాం : మహేశ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, వరంగల్ విపణిలో మక్కల ధర తగ్గిన విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ఆదేశాలు రాగానే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు జరిపేందుకు కసరత్తు చేస్తున్నాం.

ఈ రైతు పేరు గుగులోతు శక్రూ. నర్సంపేట మండలం ఆకులతండ గిరిజన రైతు. అదే గ్రామ శివారులోని 20 గుంటల సొంత భూమిలో మొక్కజొన్న పంట వేసి మూడు రోజుల క్రితం నర్సంపేట మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చాడు. నిర్ణీత తేమ శాతం రావడంతో నేడు వ్యాపారులు క్వింటాకు రూ.1701లకు కొన్నారు. ఇష్టం లేకున్నా అమ్మక తప్పలేదు. చెన్నారావుపేట మండలం ఈర్యతండాకు చెందిన ఆజ్మీర గణేశ్ యువరైతు. తండ్రితో కలిసి మూడెకరాల్లో మొక్కజొన్న పంట పండించాడు. నాలుగు రోజుల క్రితం మార్కెట్‌కు తెచ్చి తేమశాతం ఎక్కువగా ఉందంటే ఆరబోశాను. క్వింటా రూ.1800లకు కొన్నారు. ఎకరానికి రూ.23–25వేల పెట్టుబడి ఖర్చు పెట్టాం. తీరా విక్రయానికి తెస్తే తక్కువ ధరకు కొన్నారు. కనీసం క్వింటాకు రూ.2వేలు చెల్లిస్తే బాగుండేది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు ఇస్లావతు రామచందర్ చెన్నారావుపేట మండలం అక్కలచెడ. మార్కెట్‌లో మక్కల ధర తగ్గుతున్నందున వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేపట్టాలి.

## అప్పుల ఊబిలో సర్పంచులు

జనగామ : గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు ఇస్తున్నారు. అన్నీ బాగానే ఉన్నా.. గ్రామాభివృద్ధి కోసం వివిధ పనులు చేపట్టిన సర్పంచులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఓ జిల్లాలో.. చేసిన పనులకు బిల్లులు రాలేదన్న ఆవేదనతో ఓ సర్పంచి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన పల్లె ప్రగతి పనులకు బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేశామని, ఖజానా కార్యాలయంలో చెక్కులు జమ చేసినా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. జిల్లా పంచాయతీరాజ్, ఇంజినీరింగు శాఖల వద్ద సర్పంచులకు చెల్లించాల్సిన బకాయిల సమాచారమే లేదంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 77 మండలాలు ఉండగా 1688 పంచాయతీలున్నాయి. వీరిలో పలువురు సర్పంచులకు రూ.కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఆదాయ.. వ్యయాలు ఇలా..

పంచాయతీలకు పన్నులు, పన్నేతరాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంస్థల నిధులు గ్రాంట్ల రూపేణా జమ కావాలి. జనగామ మండలం పెద్దపహాడ్ పంచాయతీకి నెల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలు, ఎస్ఎఫ్‌సీ నుంచి రూ.1.50 లక్షలు రావాలి. ఏడాది నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్రం నుంచి నిధులు రాలేదు. జనవరిలో రూ.5 లక్షలు వచ్చాయి. ఫిబ్రవరి నుంచి ఈ నెల వరకు రూపాయి కూడా రాలేదు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ఇతర ఆదాయాలను ఖజానా కార్యాలయంలో జమ చేశారు. పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదని సర్పంచి పేర్కొన్నారు.

ఖర్చులను పరిశీలిస్తే..

పంచాయతీ సిబ్బంది ఎనిమిది మంది వేతనాలకు రూ.59000, విద్యుత్తు బిల్లు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్ ఖర్చు రూ.12 వేలు, నర్సరీల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు ఇతర ఖర్చులు రూ.15 వేలు ఉంటాయి. గ్రామాభివృద్ధిలో భాగంగా సర్పంచి చేసిన పనులకు సంబంధించి చెక్కులు సమర్పించి నెలలు గడుస్తున్నా డబ్బులు రాలేదని చెప్పారు. క్రీడా ప్రాంగణాలు, రైతు వేదికల పనులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉందన్నారు. నిధులు మంజూరైనా విద్యుత్తు బిల్లులకు మళ్లించారని చెప్పారు.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడు సర్పంచి టి.ఉప్పమ్మ చేసిన పనులకు బిల్లులు రాలేదు. గౌరవం వేతనం కూడా అందకపోవడంతో కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళుతున్నారు. నెలలు గడుస్తున్నాయి–జి.శ్రీలత, సర్పంచి, పెద్దపహాడు, జనగామ జిల్లా

రూ.10 లక్షలతో గ్రామంలో కల్వర్టు నిర్మించాం. సీసీ రోడ్లు వేశాం. నీటి సరఫరా వ్యవస్థ మరమ్మతులు అన్నీ కలిపి సుమారు రూ.8 లక్షలు రావాల్సి ఉంది. క్రీడా ప్రాంగణం పనుల డబ్బులు రావాలి. ఎంబీ రికార్డు కావాల్సినవి ఇంకొన్ని ఉన్నాయి. ఇటీవల మంత్రి కేటీఆర్ రూ.250 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించడంతో ఎదురు చూస్తున్నాం. రూ.20 లక్షల బిల్లులు రావాలి–పల్లెపు వెంకటనర్సింగరావు, సర్పంచి, జఫర్‌గఢ్

పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు, క్రీడాప్రాంగణాలు తదితర పనులకు సంబంధించి రూ.20 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఎంబీ రికార్డు అయినా, చెక్కులు సమర్పించినా రాలేదు. అప్పులపై వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాము.

అప్పులు తెచ్చి పనులు చేయించాను–లింగంపల్లి ప్రసాదరావు, సర్పంచి, గూడపల్లి, రేగొండ మండలం, భూపాలపల్లి

రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేయించాను. రూ.22 లక్షల వరకు అప్పులు తెచ్చాను. చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉంది. నాలుగు నెలలుగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు రావడం లేదు.

కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది–భూక్య రమేశ్, సర్పంచి, తాట్యా తండా, కురవి మండలం, మహబూబాబాద్ జిల్లా.

కొత్తగా ఏర్పడిన పంచాయతీని అభివృద్ధి చేసేందుకు అప్పులు తెచ్చి పనులు చేయించాను. అసలు, వడ్డీ కలిపి రూ.30 లక్షల మేర అప్పులయ్యాయి. బిల్లులు రాలేదు. కుటుంబ పోషణకు కొలువు సాధించే యత్నంలో ఉన్నాను.

ప్రభుత్వానికి నివేదిస్తాం– కె.రంగాచారి, డీపీవో, జనగామ

సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జిల్లా పంచాయతీ విభాగం ప్రమేయం ఉండదు. అయినా సర్పంచుల ఇబ్బందులను, బకాయిలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం.

## ప్రత్యామ్నాయ చర్యలు ఏవి..?

మహబూబాబాద్ : ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పథకంపై పూర్తి స్థాయిలో ఆధారపడి ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేసుకోకుంటే మానుకోట పట్టణ ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పవు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడం.. పైపులైన్ వేసిన ప్రాంతాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేస్తామంటున్న అధికారుల మాటలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. పట్టణంలో ఇటీవల తరుచుగా సాంకేతిక కారణాలు, మిషన్ భగీరథ అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి పరిష్కారానికి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకుంటే సుమారు 80 వేలకు పైగా ఉన్న పట్టణ ప్రజలకు ఈ సీజన్‌లో తాగునీటి కోసం ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. ఇటీవల మిషన్ భగీరథ పథకం పాలేరు జలాశయం వద్ద నిర్వహణ పనుల నేపథ్యంలో సుమారు 5 రోజులు నీటి సరఫరా నిలిచిపోయింది. నర్సంపేట నియోజకవర్గానికి వెళ్లే పైప్‌లైన్‌కు అనుసంధానంగా ట్యాపింగ్ పాయింట్స్‌ను గ్రిడ్ అధికారులు ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారు. 24 ట్యాపింగ్ పాయింట్లు ఉండగా పైపులైన్ నిర్మాణ పనులు పూర్తికాక ముందే 15 వరకు ట్యాపింగ్ పాయింట్లు మూసివేశారు. దీంతో మహబూబాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోతోంది. బాబునాయక్ తండాలో ఇటీవల పాయింట్‌ను మూసివేయడంతో తీవ్రమైన నీటి సమస్య ఏర్పడింది. మూడు రోజుల కిందట పాలేరు నుంచి వచ్చే పైపులైన్ పగిలిపోవడంతో పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానికంగా అక్కడక్కడ పైపులు లీకేజీ కావడం, కొన్ని చోట్ల పగిలిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత బజార్‌లోని కొన్ని ప్రాంతాలకే తాగునీరు సరఫరా అవుతోంది. కొత్త బజార్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. పురపాలక సంఘం అధికారులు తాత్కాలికంగా కొన్ని వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక ఇంటికి పది బిందెలకు మించి నీటిని పోయడం లేదు. దీంతో నీటి సమస్య తీవ్రంగా మారింది.

# ఆలయ పార్కింగ్ స్థలంలో రహదారి నిర్మాణమెప్పుడో?

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ పార్కింగ్ స్థలం భవన వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారింది. ఆలయ కట్టపై ఉన్న శిథిలమైన రాజరాజేశ్వర వసతి గదులను తొలగించిన అధికారులు ఆ వ్యర్థాలను తీసుకెళ్లి ఆలయ పార్కింగ్ స్థలంలో కుప్పలుగా పోశారు. దీంతో చదునుగా ఉండే పార్కింగ్ స్థలం వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారి భక్తుల వాహనాల రాకపోకలకు, నిలిపేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో గుంతలు ఏర్పడి భక్తుల వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాలన్నీ మొదటి బైపాస్ రోడ్డు నుంచి కట్టపైన పార్కింగ్ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి వీఐపీ రోడ్డు మీదుగా నటరాజ్ విగ్రహం కూడలి, భీమేశ్వర సదన్, బద్ది పోచమ్మ ఆలయానికి రావాల్సిన వాహనదారులు పార్కింగ్ స్థలంలో రోడ్డు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం లేక, గుంతలతో పార్కింగ్ స్థలం అంతా తిరగాల్సిన దుస్థితి భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. వాహనాలు ఉన్న సందర్భంలో వీరు పడుతున్న బాధలు వర్ణణాతీతం.

**మొదలు కాని పనులు**

పార్కింగ్ స్థలంలో ఏటా వర్షాకాలంలో బురదతో గుంతలు పడి భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని రోడ్డు నిర్మాణానికి ఆలయ అధికారులు ప్రతిపాదనలు చేశారు. దీంతో నిధులు మంజూరయ్యాయి. ఇంజినీరింగ్ అధికారులు రూ. 10 లక్షలతో పనులు చేసేందుకు అయిదు నెలల క్రితమే టెండర్లు ఖరారు చేశారు. దీని ప్రకారం గుడి చెరువు కట్ట కింది కూడలి కమాన్ ప్రాంతం నుంచి పార్కింగ్ స్థలంలోని మూత్రశాలల వరకు రోడ్డు నిర్మించేందుకు



టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ఇది జరిగి అయిదు నెలలు గడిచినా పనులు మొదలు కాకపోవడంతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**అంచనా వ్యయం తగ్గించేందుకు..**

పార్కింగ్ స్థలంలో రోడ్డు నిర్మాణానికి అంచనా వ్యయం తగ్గించేందుకు అధికారులు రాజరాజేశ్వర వసతి గదుల శిథిల వ్యర్థాలను పార్కింగ్ స్థలంలో పోశారు. దీంతో మొరం పోయాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ఫలితంగా మొరానికి అయ్యే వ్యయం తగ్గుతుందని భావించిన అధికారులు భవన వ్యర్థాలను వేశారు. వాటిని చదును చేసి దానిపై మొరం పోసి నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇలా చేయడం వల్ల సగం వ్యయం తగ్గుతుందని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం భవన వ్యర్థాలను పార్కింగ్ స్థలంలో రోడ్డు ఏర్పాటుకు వినియోగించకుంటే మరో రూ. 10 లక్షలు వెచ్చించాల్సి వచ్చేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

**టెండరు ప్రక్రియ పూర్తి**

రహదారి నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయింది. పార్కింగ్ స్థలంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. సమ్మక్క, సారలమ్మ జాతర నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ వ్యయం తగ్గించేందుకు భవన వ్యర్థాలను వినియోగించడం జరుగుతుంది. రఘునందన్, డీఈఈ, రాజన్న ఆలయం

# ప్రకృతి ప్రకోపం కష్టాల వ్యవసాయం

మంథని: ప్రకృతి బీభత్సానికి మంథని మండలంలోని మానేరు, గోదావరి వరదలకు పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి. ఊహించని నష్టం వాటిల్లడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మానేరు వరదలకు మంథని మండలంలోని చిన్నఓదాల, అడవిసోమన్‌పల్లి చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. గతంలో ఎన్నడూ లేనంతగా గత జులైలో వరద ముంచెత్తడంతో మానేరు తీరంలో 1,047 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వీటిని తొలగించడానికి ఎకరానికి రూ. 50 వేల వరకు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. నిండా మునిగినందున ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

**ఇసుక మేటలు ఇలా..**

వరద బీభత్సానికి మానేరు తీరంలో ఉన్న అడవిసోమన్‌పల్లిలో 50 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. నాగెపల్లిలో 60 ఎకరాల్లో, స్వర్ణపల్లిలో 30, వెంకటాపూర్‌లో 20, గోపాల్‌పూర్‌లో 100, పెద్దఓదాలో 150, చిన్న ఓదాలలో 480, బిట్టుపల్లిలో 10, గోదావరి తీరంలోని పోతారంలో 55, విలోచవరంలో 30, ఖానాపూర్‌లో 20, ఖాన్‌సాయిపేటలో 12, మంథనిలో 30 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. మంథని మండలంలో 535 ఎకరాల్లో వరి, 855 ఎకరాల్లో పత్తి పంటలకు నష్టం వాటిల్లింది.

**ప్రభుత్వం ఆదుకోవాలి**

చెక్‌డ్యాం తెగిపోవడంతో ఉద్ధృతంగా వరద వచ్చి పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి. నాకున్న అయిదు ఎకరాల భూమి పనికి రాకుండాపోయింది. పాలిహౌస్ ఉన్న మిరుప నారు, నాట్లు వేసిన వరి కొట్టుకుపోయి రూ. 5 లక్షల వరకు నష్టం జరిగింది. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి. యాసంగిలో పంటలు సాగయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులకు సాయం అందించేందుకు అధికారులు సహకరించాలి.

జిముడ కొండయ్య, రైతు, అడవిసోమన్‌పల్లి

**బీడు భూమిగా మారింది**

నాగుల రాజయ్య, రైతు, చిన్నఓదాల

మాకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. ఇసుక మేటలు వేయడంతో భూమి సాగుకు నోచుకోక బీడుగా మారింది. డబ్బులు లేక మేటలను తొలగించడం లేదు. బ్యాంకులు రుణ సాయం అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వరదలకు మోటార్లు, పైపులైన్లు దెబ్బతినడంతో పాటు పంటలు పండని కారణంగా సుమారు రూ. 8 లక్షల వరకు నష్టం జరిగింది. ఇసుకను బయటకు తరలించడానికి రైతులకు అనుమతులు ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

# అధునాతనం.. పౌర బాగస్వామ్యం




గోదావరిఖని : పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. శాసనసభ ఎన్నికల్లో సరికొత్త విధానాలను అందుబాటులోకి తెస్తోంది. 2018 ఎన్నికల్లో ఈవీఎంలకు వీవీప్యాట్లను అనుసంధానించింది. దీని ద్వారా ఓటరు ఏ గుర్తుకు ఓటు వేశారో తెలుసుకునే అవకాశం కల్పించింది. అలాగే ప్రలోభాలను అడ్డుకోవడానికి పలు చర్యలు చేపట్టింది. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రజలను భాగస్వాములను చేస్తోంది. మొత్తానికి గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి సరికొత్త విధానాలు, పద్ధతులను అమలు చేయనుంది.

**ఈవీఎంలపై అభ్యర్థుల చిత్రాలు**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలో పొందుపరుస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎం)లో పార్టీ చిహ్నం, అభ్యర్థి పేరుతో పాటు ఫొటో కూడా కనిపిస్తుంది. పోస్టల్ బ్యాలెట్‌లపై కూడా అభ్యర్థి ఫొటోలు ముద్రించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

**యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు**

యువ ఓటర్లు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈసారి యువతకు కూడా అందుబాటులోకి తేనున్నారు.

**'సువిధ'లో సులభతర అనుమతి**

ఈసారి అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే నామినేషన్లు దాఖలు చేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి వద్దకు రాకుండానే ఆన్‌లైన్‌లో నామినేషన్ పత్రాలను పంపించే ఏర్పాటు చేసింది. ఇందుకోసం- యాప్ ద్వారా నామినేషన్ వేసే అవకాశం కల్పించారు. నామినేషన్ల గడువులోగా నిర్దిష్ట విధానంలో సాధారణ నామినేషన్ తరహాలోనే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. రిటర్నింగ్ అధికారిని నేరుగా కలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వివరాలతో కూడిన పత్రాలను మూడు సెట్లు అందించాల్సి ఉంటుంది. అయితే నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు ప్రక్రియకు నేరుగా అభ్యర్థులు, వారి ప్రతినిధులు హాజరు కావాల్సి ఉంటుంది.

**పోస్టల్ బ్యాలెట్‌కు ముందుగానే దరఖాస్తు**

ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తపాలా ఓటు విధానం అమలవుతోంది. గతంలో పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే సమయంలో వినియోగించుకోవాల్సి ఉండేది. దీంతో ప్రతి నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో వెనుకబాటు కనిపించేది. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందుగానే ఓటు వేసే వెసులుబాటు కల్పించారు.

**ఓటరుకు అండగా యాప్**

ప్రతి ఎన్నికల్లోనూ ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం చిరునామాను ఎవరిని అడిగినా ఫలితం లేక చాలా మంది ఓటు వేయకుండానే నిరాశగా వెనుదిరిగిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి 'మై ఓటర్ హెల్ప్‌లైన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా పోలింగ్ కేంద్రాలతో పాటు ఓటరు జాబితాలో పేర్లున్నాయా? లేదా? అనే విషయం సులభంగా తెలుసుకోవచ్చు. ఇ-ఎపిక్ కార్డు కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**ప్రత్యేక లెక్కింపు బృందాలు**

ఎన్నికల్లో వ్యయ నియంత్రణను ఈసారి మరింత పకడ్బందీగా అమలు చేయనున్నారు. చాలా మంది అభ్యర్థులు లెక్కకు మించి డబ్బు వెచ్చిస్తున్నారు. దీన్ని పక్కాగా లెక్కించేందుకు ఈసారి అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక బృందం పర్యవేక్షిస్తుంది. కోశాగార శాఖకు చెందిన సీనియర్ అధికారి నేతృత్వంలో సిబ్బంది పని చేస్తారు. గతంలో అభ్యర్థులు వ్యయ వివరాలను పదిహేను రోజులకు పరిశీలకులకు సమర్పించేవారు. ప్రస్తుతం అన్ని రకాల ఖర్చులను అకౌంటింగ్ బృందాలు ఎప్పటికప్పుడు పరోక్షంగా పరిశీలించనున్నాయి.

**సీ విజిల్ ఆధునికీకరణ**

ఎన్నికల్లో అక్రమాల నియంత్రణకు సీ విజిల్ యాప్ ఉపయుక్తంగా మారింది. తొలిసారిగా 2014లో ఈ యాప్‌ను అందుబాటులోకి తేగా ప్రస్తుతం దీన్ని ఆధునికీకరించి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానించారు. నిబంధనలు ఉల్లంఘించిన దృశ్యాలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వంద నిమిషాల వ్యవధిలో అధికారులు అక్కడికి చేరుకుంటారు. సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు తీసుకున్న చర్యలను చరవాణికి సంక్షిప్త సందేశం పంపుతారు.

**ఇంటి నుంచే ఓటు హక్కు**

ఈ ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేయొచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఫారం 12డిని నింపి రిటర్నింగ్ అధికారికి పంపించాలి. అందులో శాసనసభ నియోజకవర్గం ఓటరు జాబితాలోని వరుస సంఖ్య పొందుపరచాలి. దివ్యాంగులైతే అందులో ఉన్న ఐచ్ఛికంలో టిక్ చేయాలి. పరిశీలించిన అనంతరం రిటర్నింగ్ అధికారి అర్హులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తారు. అధికారులే నేరుగా ఇంటికి వెళ్లి రహస్యంగా ఓటు వేసే ప్రక్రియను చేపడతారు. దీన్ని వీడియోలో చిత్రీకరిస్తారు. ఆ సమయంలో రాజకీయ పార్టీలకు సమాచారం అందిస్తారు.

# టీ-హబ్‌లోనే క్షయ నిర్ధారణ పరీక్షలు




జమ్మికుంట : జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్షయ నిర్ధారణ పరీక్షా కేంద్రాల(ల్యాబ్)ను జిల్లా కేంద్రాల్లోని తెలంగాణ డయాగ్నొస్టిక్స్ (టీ-హబ్)లకు తరలనున్నాయి. ఈ మేరకు జాయింట్ డైరెక్టర్ టీబీ, రాష్ట్ర టీబీ కార్యాలయం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేశారు. రెండేళ్ల క్రితం జిల్లాల వారీగా ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లోని టీబీ యూనిట్లలో క్షయ వ్యాధి నిర్ధారణకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన 14 ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సీబీనాట్, ట్రూనాట్ యంత్రాలను ఏర్పాటు చేశారు. తాజా ఉత్తర్వులతో కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్, పెద్దపల్లి జిల్లాలోని మంథని, గోదావరిఖని ఏరియా ఆసుపత్రి, కాటారం, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, ఎల్లారెడ్డిపేట, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న టీబీ నిర్ధారణ పరీక్షా కేంద్రాలను జిల్లా కేంద్రాల్లోని టీ-హబ్‌లకు మార్చనున్నారు.

ఫలితాలు రావడంలో ఆలస్యం టీబీ కేంద్రాలను జిల్లా కేంద్రాల్లోని టీ-హబ్‌లకు తరలిస్తే అక్కడి నుంచి టీ-హబ్ వాహనాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల నుంచి రక్త, తెమడ నమూనాలను సేకరించనున్నారు. తాజాగా చేపట్టే పద్ధతితో నిర్ధారణ పరీక్ష ఫలితాలు ఆలస్యమయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న టీబీ కేంద్రాల్లో గంటన్నర వ్యవధిలోనే నిర్ధారణ ఫలితాలు వస్తున్నాయి. మారనున్న పద్ధతితో ఫలితాలు రావడానికి రెండు రోజుల వ్యవధి పట్టవచ్చని తెలుస్తుంది. క్షయ నిర్ధారణ అయితే బాధితులకు నెలవారీగా వైద్యానికి సంబంధిన మాత్రలను టీబీ కేంద్రాల్లో అందజేస్తున్నారు. తాజా పద్ధతితో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో ఇంకా స్పష్టత రాలేదు. నిర్వహణకు మరిత సమయం..గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న టీబీ యూనిట్లలోని యంత్రాలను జిల్లా కేంద్రంలోని టీ-హబ్‌కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్‌ను జారీ చేసింది. నిర్వహణకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. డాక్టర్ కేవీ రవీందర్‌రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి, కరీంనగర్

# అనర్హులకు ప్రభుత్వ భూమి

నల్గొండ : జిల్లా కేంద్రంలో పర్యాటక ప్రాంతమైన పానగల్‌లో దాదాపు రూ.పది కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని అనర్హులు అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి అధికారులు అనర్హులకు ప్రభుత్వ భూమిని అప్పనంగా అప్పగించారు. పట్టణంలోని పానగల్ ఎమ్మార్పీ ప్రాజెక్టు క్వార్టర్లు కొంతకాలం నుంచి ఖాళీగా ఉన్నాయి. క్వార్టర్ల చుట్టూ ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంపై కొంతమంది అక్రమార్కుల కన్నుపడింది. ఎలాగైనా క్వార్టర్లతో పాటు భూమిని క్రమబద్ధీకరించుకునేందుకు 59 జీవోను సాకుగా వాడుకున్నారు.

2,232 చదరపు గజాలు అన్యాక్రాంతం పానగల్‌లోని వేద పాఠశాల సమీపంలో 148, 149 సర్వే నంబర్లలోని ప్రభుత్వ క్వార్టర్లు, ఖాళీ స్థలం 2,232 చదరపు గజాలను ఎనిమిది మంది అనర్హులు ఒక్కొక్కరు 249 గజాలు, మరొకరు 490 గజాల చొప్పున 59 జీవో కింద క్రమబద్ధీకరించుకున్నారు. ఈ స్థలం విలువ సుమారు రూ. 10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా ఇల్లు నిర్మించుకుని అందులో నివాసం ఉంటూ 120 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 59 జీవోను జారీ చేసింది. దీన్ని సాకుగా తీసుకొని.. క్వార్టర్లలో, సమీప ఖాళీ స్థలాల్లో నివాసం లేని అనర్హులు నివాసం ఉంటున్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి క్రమబద్ధీకరించుకున్నారు. అనర్హులు దరఖాస్తులో పేర్కొన్న వివరాలను అధికారులు విచారించకుండా, స్థలాలను పరిశీలించకుండా, నిబంధనలు పాటించకుండా ప్రభుత్వ భూమిని అప్పటి తహసీల్దారు క్రమబద్ధీకరించారు.

# సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల నిలిపివేత

నల్గొండ : సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. పది రోజుల పాటు నీరు విడుదల చేసిన అధికారులు నీటి నిలుపుదల ప్రారంభించి సాయంత్రానికి పూర్తిగా ఆపేశారు. మరో అయిదు రోజులు నీటిని విడుదల చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినా నీటి విడుదల నిలిపివేతతో ఆ ప్రచారాలకు తెరపడింది. ప్రస్తుతం వరి పంట అత్యధిక శాతం పొట్టదశలో ఉంది. భూగర్భ జలాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. మరో వైపు పూర్తిస్థాయిలో విద్యుత్తు సరఫరా కూడా ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ కుడి, ఎడమ కాల్వలకు అయిదు టీఎంసీల చొప్పున విడుదల చేయగా ఆ నీటిని శ్రీశైలం నుంచి తీసుకున్నారు. కృష్ణా యాజమాన్య బోర్డు కేటాయించిన నీటిని రెండు రాష్ట్రాలు కొంతమేర సాగునీటి అవసరాలకు వాడుకున్నాయి. ఎడమ కాల్వకు మొదటి రోజు (ఏడో తేదీన) రెండు వేల క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు మర్నాటి నుంచి ఆరు వేల క్యూసెక్కులు వదిలారు. మంగళవారం (17వరకు) మధ్యాహ్నం వరకు ఏకధాటిగా నీటిని వదిలిన అధికారులు మేజర్లన్నింటికీ నీటిని నిలిపివేసి పాలేరుకు తరలించారు.

**విడుదల తేదీ స్థాయికి..**

ప్రస్తుతం సాగర్ జలాశయంలో 525.90 అడుగుల నీటి నిల్వ ఉంది. కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేసిన ఏడో తేదీన సైతం అదే స్థాయిలో 525.30 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. ఈ పది రోజులు వదిలిన నీరంతా శ్రీశైలం నుంచి రోజుకు 4 వేల క్యూసెక్కుల నుంచి 16 వేల క్యూసెక్కుల వరకు తీసుకున్నారు. తదనుగుణంగా నీటిని తీసుకోవడంతో నీటి నిల్వలు పడిపోలేదు. వాస్తవానికి శ్రీశైలం నుంచి నీటిని తీసుకోకుంటే సమారు 515 అడుగులకు పడిపోయేది. తాగునీటి అవసరాలకు పోగా మరో నెల రోజుల్లో కనీస స్థాయి 510కి పడిపోయేది. అందుకే ముందస్తుగా ఎగువ జలాశయం నుంచి నీటిని తీసుకుంటూ నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం 160 టీఎంసీల నీటి నిల్వ ఉండగా అందులో 510 అడుగులకు చేరుకుంటే (డెడ్‌స్టోరేజీ) 29 టీఎంసీలు వాడుకోవడానికి అవకాశం ఉంటుంది. 500 అడుగుల నీటి నిల్వ ఉంటే 45 టీఎంసీలు తీసుకోవచ్చు. ఎడమ కాల్వకు 510 అడుగుల కంటే తక్కువ ఉంటే నీరు తీసుకోవడం కష్టమని అధికారులు పేర్కొంటున్నారు.



**ప్రభుత్వ నిర్ణయమే**

వాస్తవానికి కృష్ణా యాజమాన్య బోర్డు కేటాయించిన నీటిలో ఇప్పటి వరకు కేవలం 5 టీఎంసీలు వాడుకున్నందున మరో 30 టీఎంసీలు వాడుకునే వీలుంది. అందులో పంట చేతికి వచ్చేందుకు మరో దఫా నీటిని విడుదల చేయడానికి అవకాశం ఉంది. ఎండుతున్న పంటలను కాపాడాలంటే ప్రభుత్వం నీరు విడుదల చేయడానికి అవకాశం లేకపోలేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో కచ్చితంగా నీరు ఇస్తారనే రైతులు ఆశపడుతున్నారు.

**మరో దఫా ఇవ్వక తప్పదా**

సాగర్ ఎడమ కాల్వ కింద దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ప్రస్తుతం విడుదల చేసిన నీరుతో ఎండిపోతున్న పంటను చాలా వరకు కాపాడుకున్నారు. కాల్వ చివరి ప్రాంతాలకు మినహా ముందున్న (కాల్వకు ఎగువ తూములు) రైతులు తమ పొలాలను తడుపుకోగలిగారు. అందులో ముందస్తుగా నాట్లు వేసిన దాదాపు 80 వేల ఎకరాల్లో వరి ఈత, గింజ పోసుకునే దశలో ఉంది. మరో 1.20 లక్షల ఎకరాల్లో ఆలస్యంగా నాట్లు వేసిన రైతుల పొలాలు చిరుపొట్ట, పొట్ట దశలోనే ఉన్నాయి. వీటికి దాదాపు నవంబరు మొదటి వారం వరకు నీరు అవసరం ఉంటుంది. ఇప్పుడు ఇచ్చిన నీటితో బోర్లు, బావుల్లో నీటి నిల్వలు పెరిగినందున మరో పది, పదిహేను రోజుల వరకు ఇబ్బంది లేదు. తర్వాత బోర్లు, బావుల్లో నీటి నిల్వలు పడిపోతే పంటకు నీటి అవసరం పెరుగుతుంది. దీంతో మరో దఫా సాగర్ నీటి కోసం ఎదురుచూడాల్సిందే. కేవలం విద్యుత్ మోటార్ల ఆధారంతోనే నీరు అందాలంటే పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. నవంబరు మొదటి వారంలో పది రోజుల పాటు నీరు విడుదల చేయాలని, లేదంటే పంట ఎండిపోయి దిగుబడులు రావని రైతులు పేర్కొంటున్నారు. చేతికి వచ్చే సమయంలో ఆరుగాలం పడిన కష్టం అంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాల్వ చివరికి నీరందక కొంతమంది రైతులు పంటను వదిలేశారు. ఈసారి నీరు రాకపోతే ఆ కాసింత వదిలేయాల్సిందే.

# అటో ఊరు.. ఇటో ఊరు..!

నల్గొండ : మాడ్గులపల్లి మండలంలోని మాచనపల్లి, తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెం గ్రామాలు వేర్వేరు మండలాలు, వేర్వేరు (నల్గొండ, నాగార్జునసాగర్) నియోజకవర్గాల్లో ఉన్నాయి. అవి పేరుకే వేర్వేరు నియోజకవర్గాలు, మండలాలు. కానీ.. పక్కపక్కనే ఉంటాయి. రెండు గ్రామాల మధ్య ఒక రహదారి మాత్రమే అడ్డుగా (సరిహద్దుగా) ఉంటుంది. రెండు పంచాయతీలు కూడా కొత్తగా ఏర్పాటు అయినవే. అంతకు ముందు మాచనపల్లి గ్రామం నిడమనూరు మండలంలోని ధర్మాపురం గ్రామానికి ఆవాస గ్రామం. అయితే.. గంగన్నపాలెం తిప్పర్తి మండలం రాజుపేట గ్రామానికి ఆవాస గ్రామం. అయిదేళ్ల క్రితం రెండు నూతన పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. ఆ గ్రామాల్లోని ప్రజలకు రెండు గ్రామపంచాయతీలు వేరు అనే భావన ఉండదు. నిత్యం కలిసిమెలిసి ఉంటారు. కేవలం ఒక రహదారి మాత్రమే రెండు గ్రామాలను వేరు చేస్తుంది తప్పితే ప్రజలు ఒకే ఊరి వాళ్లలాగా ఉంటారు. మాచనపల్లి గ్రామ జనాభా 627 మంది కాగా.. 471 మంది ఓటర్లు ఉన్నారు. గంగన్నపాలెంలో కూడా జనాభా అంతే మంది ఉంటారు. ఎన్నికలు వస్తే ఒక గ్రామంలో ఒక నేత ప్రచారం చేస్తే.. మరో గ్రామంలో మరో నేత ప్రచారం చేస్తారు. గ్రామస్థులకు మాత్రం రెండు వైపులా ప్రచార సందడి ఉంటుంది. ఇటీవల నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో మాచనపల్లిలో ఎన్నికల హడావుడి ఉంటే, పక్కనే ఉన్న గంగన్నపాలెంలో ఎన్నికలు లేకపోయినా అదే సందడి కనిపించింది.

# రెచ్చగొట్టొద్దు.. సంయమనం కోల్పోవద్దు

ఖమ్మం : చేతిలో ఫోన్ ఉంది కదా? అని సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్య చేశారా? ఎవరో పెట్టిన పోస్టు మీకు నచ్చలేదన్న కారణంతో కాస్త కఠినంగా కామెంట్లు చేస్తూ వ్యతిరేకించారా? అయితే పోలీసు కేసుల్లో ఇరుక్కున్నట్లే. ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెట్టిన వారిపైన కేసులు పెడుతూ వచ్చిన పోలీసులు ఇప్పుడు పోస్టుల కింద కామెంట్లు పెడుతున్న వారిపైనా నిఘా ఉంచనున్నారు. ఐటీ చట్టంతోపాటు ఐపీసీ కింద కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకుల మధ్య పచ్చిగడ్డి వేస్తే మంటలు చెలరేగుతున్నాయి. ఈ సమయంలో పోస్టింగ్‌ల విషయంలో జాగ్రత్తలు అత్యవసరం.

గ్రూప్ అడ్మిన్లదే బాధ్యత రమాకాంత్, సీఐ, మణుగూరు

రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయ ప్రసంగాలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వివిధ సామాజిక మాధ్యమాల్లో



నమోదవుతున్న పోస్టులను సైబర్ టీం అణువణువునా పర్యవేక్షిస్తూనే ఉంటుంది. సామాజిక మాధ్యమాలపై నిరంతరం సైబర్ పెట్రోలింగ్ జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ అందరూ సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిందే. అదేవిధంగా ఏ గ్రూపులో అయితే అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు పెడతారో అందుకు ఆ గ్రూపు అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

కామెంట్ల విషయంలో అప్రమత్తత అవసరం

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు, పాస్‌పోర్టులకు దరఖాస్తు చేసుకునే వారు, విద్యార్థులు, యువత.. ఇటువంటి వాటిలో ఇరుక్కుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యవహారంలో సంయమనం పాటించాలని స్పష్టం చేస్తున్నారు. సాధారణ సమయంలో సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడితే నమోదయ్యే కేసులకు, ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులకు చాలా తేడా ఉంటుందని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్లు పొందుపరిచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# ఉపాధిలో పోషక వనాలు

సారంగాపూర్ : కూరగాయల సాగులో రసాయన ఎరువుల వినియోగం పెరిగి ప్రజలు వివిధ వ్యాధులతో బాధపడాల్సి వస్తోంది. అంతేకాకుండా కూరగాయల ధరలు ఎప్పుడు పెరుగుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ ఎరువుల వినియోగంతో అందుబాటులోనే కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా 'పోషక వనాలు' ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జగిత్యాల జిల్లాలో ప్రస్తుతం ఎంపీడీవో, ఏపీవోలకు పోషక వనాల ఏర్పాటుపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి రైతును ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం విడతల వారీగా హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తుండగా ప్రతి మండలంలో దాదాపు వంద ఎకరాలు కూరగాయల సాగు కింద పోషక వనాలు పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పోషకాలతో ..

ఇటీవల మార్కెట్‌లో కూరగాయల ధరలు అకాశాన్నంటాయి. కిలో టమాటను సామాన్యుడు కొనుగోలు చేయని పరిస్థితి ఏర్పడింది. తరచూ కూరగాయల ధరలు పెరగడం, ధరల్లో వ్యత్యాసం ఉండడం పరిపాటుగా మారుతోంది. అంతేకాకుండా పేద మధ్యతరగతి కుంటుంబాలు సరైన పోషకాలు గల కూరగాయలు, ఆకుకూరలు కడుపు నిండా తినలేని పరిస్థితులున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని వంటింట్లో కూరగాయల మంట తగ్గించేందుకు కేంద్రం ఉపాధిహామీ పథకంలో పోషక వనాలు పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులకు శిక్షణ కొనసాగుతోంది.

పొలాలు, ఇళ్ల వద్ద..

ఉపాధి హామీలో చేపట్టే పోషక వనాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇందుకు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా సాయం అందించనున్నారు. పంట పొలాల వద్ద అర ఎకరా, పావు ఎకరా వ్యవసాయ బావుల వద్ద ఎంపిక చేసుకుని కూరగాయల సాగు చేపట్టవచ్చు. ఇళ్ల పెరట్లో కూరగాయల సాగును ప్రోత్సహించనుంది. పోషక వనాల ఏర్పాటుకు వివిధ రాయితీలు కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చనున్నారు. దీంతో పాటు వనాల అభివృద్ధికి సాంకేతిక సహాయాన్ని అందించేందుకు ఉపాధి సిబ్బందికి, ఎంపిక చేసిన రైతులకు తగు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా ఇప్పటికే మహిళా సంఘాల ద్వారా ఇంటింటా పెరటి తోట పెంపకం చేపడుతుండగా అదనంగా ఉపాధి పోషక వనాలతో గ్రామాల్లో పోషక విలువలతో కూడిన నాణ్యమైన కూరగాయలు అందనున్నాయని భావిస్తున్నారు.

విడతల వారీగా వినోద్‌రెడ్డి, సాంకేతిక సహాయకుడు

జిల్లాలో విడతల వారీగా పోషక వనాల పెంపుపై హైదరాబాద్‌లో శిక్షణ కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేంద్రియ ఎరువులతో కూడిన కూరగాయలు అందించేందుకు ఉపాధిహామీ ద్వారా ప్రోత్సహించనున్నాం. జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతుల వారీగా ఎంపిక చేసి కూరగాయల పెంపునకు తగు చర్యలు తీసుకోనున్నాం. అన్ని మండలాల్లో శిక్షణ పూర్తికాగానే లక్ష్యాన్ని నిర్దేశించి రైతులను ఎంపిక చేయనున్నాం.

# భద్రాద్రి ఏజెన్సీలో నిఘా నేత్రం



ఖమ్మం :ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడంతో మావోయిస్టు ప్రభావిత భద్రాద్రి ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌ను ఆనుకొని ఉన్న భద్రాచలం ఏజెన్సీలోని అన్ని పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించిన అధికారులు ఎన్నికలకు సిద్ధమైన వేళ అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించనున్నారు. అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని గుర్తించిన అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఓ పక్క అక్రమంగా తరలుతున్న డబ్బుపై దృష్టి పెట్టిన పోలీసులు ఏజెన్సీలో మావోయిస్టుల కదలికలపై జాగ్రత్తతో ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు.

సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు ఉన్న రహదారుల్లో ఎప్పటికప్పుడు నిఘా పెట్టిన పోలీసులు అటుగా వచ్చే వారిపై డేగ కన్నేశారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ దిశానిర్దేశంతో చర్ల, దుమ్ముగూడెం సీఐలు రాజగోపాల్, దోమల రమేశ్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు సరిహద్దు కూడళ్లలో నిఘాపెట్టి ఆకస్మిక తనిఖీలు సాగిస్తున్నారు. వాహన తనిఖీలతో పాటు సరిహద్దు గ్రామాల నుంచి వచ్చే వారిని క్షుణ్ణంగా సోదాలు చేసి పంపిస్తున్నారు. చర్లలో ఎస్సైలు వెంకటప్పయ్య,నర్సిరెడ్డి, టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు.

మరో పక్క అధికార పార్టీ నాయకులతో పాటు ప్రజాప్రతినిధులను ఎన్నికల ప్రచారానికి ముందుగా సమాచారం ఇవ్వాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. కీకారణ్య గ్రామాల్లో పర్యటించేముందు విధిగా తమకు సమాచారం ఇవ్వాల్సిందిగా రాజకీయ పార్టీల నేతలకు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే అధికార, విపక్ష పార్టీల నేతలు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టి మారుమూల గ్రామాల్లో పర్యటనలు సాగిస్తున్నారు. పోలీసులు మరింత అప్రమత్తమై ప్రత్యేక బలగాలను రంగంలోకి దించి సరిహద్దు అడవుల్లో కూంబింగ్ కొనసాగిస్తున్నారు. బేస్ క్యాంపుల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

ప్రధానంగా సరిహద్దు గ్రామాల నుంచి వచ్చే వారి నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర పారా మిలిటరీ బలగాలు అనుమానిత గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. సీఆర్పీఎఫ్ 141, 151, 81 బెటాలియన్లతో పాటు కోబ్రా బెటాలియన్ జవాన్లు సరిహద్దు గ్రామాలల్లో భద్రత చర్యలో నిమగ్నమయ్యారు.

# మత్తుకు ముకుతాడు



ఖమ్మం :శాసనసభ ఎన్నికల ప్రవర్తన నియమావళి(కోడ్) అమల్లోకి రావటంతో మద్యం అమ్మకాల నియంత్రణపై అధికారులు దృష్టి సారించారు. విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణదారులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. ఎక్కువ శాతం కేసులను పోలీసు శాఖ నమోదు చేస్తుండగా ఎక్సైజ్‌శాఖ సైతం ఇదే పనిలో నిమగ్నమయ్యింది. ఇన్నాళ్లు వీలైనంత మద్యం అమ్మాలని సూచించిన అధికారులు.. ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రలోభాల పర్వానికి అడ్డుకట్ట వేసేందుకు మద్యం విక్రయాలను నియంత్రించాలని భావిస్తున్నారు. పది రోజులుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మద్యం అమ్మకాల్లో కాస్త వేగం తగ్గిందని ఆబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఉభయ జిల్లాల్లో 4వేలకు పైగా బైండోవర్ కేసులు

ఖమ్మం జిల్లా పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక 2,250 మంది బెల్టు దుకాణదారులపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. సత్తుపల్లి ఏసీపీ పరిధిలో 850, వైరా ఏసీపీ పరిధిలో 670, ఖమ్మం పట్టణ ఏసీపీ పరిధిలో 200కు పైగా కేసులు నమోదయ్యాయి. మరోవైపు ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 450కి పైగా బెల్టుదుకాణదారులపై బైండోవర్ కేసులు నమోదైనట్లు ఆయా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. భద్రాద్రి జిల్లా పరిధిలో పోలీసు, ఆబ్కారీ శాఖ అధికారులు ఇప్పటివరకు 1,500కు పైగా బైండోవర్ కేసులు నమోదు చేశారు.

మద్యం అమ్మకాల్లో క్షీణత

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక బైండోవర్ కేసులు నమోదు చేస్తుండటంతో మద్యం అమ్మకాలు కాస్త తగ్గినట్లు వైరా మద్యం డిపో అధికారులు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి ఈనెల 17 వరకు డిపోలో రూ.60 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది అక్టోబర్‌లో ఇదే సమయంలో రూ.68 కోట్ల మద్యం అమ్ముడుపోయింది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఎప్పుడైనా కిందటేడాదితో పోల్చి అమ్మకాల వృద్ధి లెక్కిస్తారు. ఎన్నికల నియమావళి అమలుతో బెల్టు దుకాణాలు మూతపడటం వల్ల మద్యం అమ్మకాలు తగ్గాయి. ఉభయ జిల్లాల్లో ఏడాదికి సగటున రూ.3వేల కోట్ల మద్యం విక్రయాలు సాగుతుంటాయి.

మరో వారం పాటు ఇదే పరంపర

ఉభయ జిల్లాల్లో బెల్టు దుకాణాల సంఖ్య 7వేలకు పైగా ఉన్నట్లు అంచనా. ఒక్కో మండలంలో బెల్టు దుకాణదారులు 150-200 మంది ఉన్నారు. మద్యం అమ్మకాల్లో సింహభాగం బెల్టు దుకాణాల ద్వారానే జరుగుతుంది. ఎన్నికల నియమావళి అమల్లోకి రావటంతో ఇప్పటివరకు ఉభయ జిల్లాల్లో సుమారు 4 వేల మందిపై అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. మరో వారం పాటు ఈ కేసుల పరంపర కొనసాగనుంది.

అతిక్రమిస్తే..

బైండోవర్ కేసు నమోదైతే సదరు వ్యక్తులను తహసీల్దార్ల ఎదుట హాజరుపరుస్తారు. మళ్లీ మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా లేదా ఏడాది పాటు జైలుకు వెళ్లాల్సిందే. దాబాలు, బడ్డీ కొట్లు, ఇతర చోట్ల అనధికారికంగా మద్యం విక్రయించే వారిపై పోలీసు, ఆబ్కారీ శాఖల అధికారులు దృష్టి సారించారు.

# గుంతల రోడ్డు.. తప్పని తిప్పలు..!



తాడ్వాయి : గిరిజనుల ఆరాధ్య దైవమైన సమ్మక్క, సారలమ్మ దర్శనానికి రెండు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. వారు ప్రయణించే తాడ్వాయి-మేడారం రహదారి మాత్రం అస్తవ్యస్తంగా మారింది. దారి పొడవునా గుంతలతో వాహన రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

జాతరకు ప్రధాన మార్గం

రెండేళ్లకోసారి జరిగే వనదేవతల మహాజాతరకు వచ్చే ఆర్టీసీ బస్సులన్నీ తాడ్వాయి మీదుగా మేడారానికి అనుమతిస్తారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు, ఇతర ప్రముఖుల వాహనాలన్నీ ఇదే దారి మీదుగా వస్తాయి. మహాజాతరకు ముందు, ఆ తర్వాత నెలల కొద్దీ ఈ రోడ్డు మీదుగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు రాకపోకలు జరుగుతాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వాహనాలు సైతం ఈ మార్గం మీదుగా మేడారం చేరుకొంటాయి. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ దారికి మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

రెండేళ్లయినా..

2022 ఫిబ్రవరిలో మహా జాతర ముగిసింది. అదే ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు దారి దెబ్బతింది. ప్రధానంగా తాడ్వాయి-పస్రా మధ్య జలగలాంచ వాగు వంతెన ధ్వంసమైంది. దీంతో ఏటూరునాగారం-హనుమకొండ వైపు వెళ్లాల్సిన వాహనాలన్నింటినీ మేడారం మీదుగా మళ్లించారు. అధిక మోతాదులో ఉండే ఇసుక లారీల రవాణా కారణంగా భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వనదేవతల దర్శనానికి విచ్చేసిన భక్తుల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

ఇరువైపులా పిచ్చిమొక్కలు..

తాడ్వాయి నుంచి మేడారం వరకు రహదారి వెంబడి ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. సుమారు 14 కిలోమీటర్ల రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వహనాలు కనిపించలేని దుస్థితి. ఫలితంగా ప్రయాణికులు నిత్యం ప్రమాదాలు చవిచూడాల్సి వస్తోంది. అయినప్పటికీ యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

# సాంకేతికత తోడుగా.. నీడలా నిఘా!

జయశంకర్ : అసెంబ్లీ ఎన్నికలకు ఇటీవలే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. నవంబర్ 30న జరగనున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే హడావుడి మొదలైంది.. ప్రశాంత నిర్వహణకు ఈసీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పకడ్బందీ చర్యలు చేపడుతోంది. క్షణాల్లో సమాచారం అందుబాటులో ఉంచేందుకు, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేం దుకు యాప్‌లు, వెబ్‌సైట్లను తీసుకొచ్చింది.

సువిధ యాప్..ఈ యాప్ పూర్తిగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఉపయోగపడుతుంది. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రచార వాహనాలకు, మైకు, సభలు, సమావేశాలకు, తదితర పలు రకాల అనుమతులు పొందడానికి వీలుంటుంది. ఈ పోర్టల్‌ను వినియోగించుకుని అభ్యర్థులు ఇంటి నుంచే అనుమతులు పొందవచ్చు. సంబంధిత నోడల్ అధికారి, సెక్షన్ అధికారులు, ఐటీ అధికారులు అందుబాటులో ఉంటారు. దరఖాస్తుదారు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన పత్రాలను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే అనుమతులిస్తారు.


పీడబ్ల్యూడీ..పీడబ్ల్యూడీ(పర్సన్ విత్ డిజబిలిటీస్) యాప్‌ను దివ్యాంగుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓటరు దరఖాస్తులు నింపేందుకు డోర్ స్టెప్ సౌకర్యం ఉంటుంది. వారికి కావల్సిన వీల్‌ఛైర్ లాంటి సౌకర్యాల కోసం కోరవచ్చు. దృష్టి లోపం ఉన్నవారికి అభ్యర్థుల పేర్లను వినగలిగే అవకాశం, తదితర సేవలను పొందవచ్చు.

నిరంతర పర్యవేక్షణ!

అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.. ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించి.. ప్రలోభాలను అరికట్టేందుకు నిఘా బృందాలను రంగంలోకి దింపుతోంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయా బృందాలు నీడలా అభ్యర్థులను, పార్టీలను వెంటాడనున్నాయి.

ఎన్నికల కోడ్ బృందాలు

జిల్లా స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షణలో ఎంసీసీ బృందాలు పనిచేస్తాయి. ప్రతి మండలానికి, మున్సిపాలిటీ పరిధిలో ఒక మోడల్ కోడ్ కండక్ట్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బృందంలో




నలుగురు సభ్యులకు తగ్గకుండా ఉంటారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, కార్యదర్శులు, పోలీసులు, వీడియో గ్రాఫర్, ఇతర సిబ్బంది బృందంలో ఉంటారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు, వ్యయాలు, చెల్లింపులపై దృష్టి సారిస్తాయి. గొడవలు, అల్లర్లు జరిగినా వెంటనే పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. ఇప్పటికే వాల్‌పోస్టర్లు, గోడ రాతలు తొలగించారు.

ప్రలోభాలకు చెక్

ప్రలోభాలకు చెక్ పెట్టేందుకు 'ఫ్లయింగ్ స్క్వాడ్' బృందాలు పర్యవేక్షిస్తాయి. బృందంలో నలుగురు సభ్యులు ఉంటారు. నియోజకవర్గానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. గెజిటెడ్ స్థాయి అధికారి, ఇద్దరు పోలీసులు, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. ఎక్కడైనా డబ్బు, మద్యం అక్రమ నిల్వలు, పంపకాలు, ఇతరత్రా సమాచారం అందిస్తే అక్కడికి వెళ్తారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై విచారణ చేపడతారు.

వ్యయ పరిశీలనకు..

అభ్యర్థికి రూ.40 లక్షల కంటే ఎక్కువ వ్యయం మించరాదనే నిబంధనలు ఉన్నాయి. వాటికంటే మించి ఖర్చు చేసే అవకాశాలుండటంతో అభ్యర్థులపై నిఘా ఉంచేందుకు నియోజకవర్గానికో వ్యయ పరిశీలన బృందాన్ని ఏర్పాటు చేశారు. వ్యయ పరిశీలకుని పర్యవేక్షణ ఉంటుంది. జిల్లా ఆడిటర్ నోడల్ అధికారిగా ఉంటారు. అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ (ఏఈవో)తో పాటు మరో ఇద్దరితో అకౌంటింగ్ బృందం అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు లెక్కిస్తారు.

ఎంసీఎంసీ బృందం

అభ్యర్థులు దినపత్రికలు, టీవీ ఛానళ్లల్లో ఇచ్చే ప్రకటనలపై 'మీడియా సర్టిఫికెట్ అండ్ మానిటరింగ్ కమిటీ'(ఎంసీఎంసీ) బృందం ద్వారా పర్యవేక్షిస్తారు. ఆరుగురు సభ్యుల బృందం ఉంటుంది. కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు.

ఎస్ఎస్‌టీ బృందాలు

నియోజకవర్గానికి మూడు స్టాటిస్టిక్ సర్వేలైన్ బృందాలు(ఎస్ఎస్‌టీ) ఏర్పాటు చేస్తున్నారు. బృందంలో గెజిటెట్ అధికారి, పోలీసు, అటవీ, ఎక్సైజ్ వారు సభ్యులుగా ఉంటారు. సభలు, సమావేశాలపై నిఘా ఉంచుతాయి. మద్యం, డబ్బు తరలింపు, ఇతరత్రా ప్రలోభాలకు సంబంధించిన వస్తువులపై నిఘా పెడతారు.

సీ-విజిల్ యాప్

ఓటర్లను అభ్యర్థులు ప్రలోభాలను గురిచేస్తే ఈ సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు, అనుచరగణం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, అల్లర్లు, గొడవలు, డబ్బు, మద్యం పంపిణీ చేసినా దీని ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో అధికారులు చర్యలు తీసుకుంటారు.

ఓటర్ హెల్ప్‌లైన్..

ఓటర్ల కోసం ఈసీ ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటు నమోదుకు ఇందులో నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు మార్పులు చేర్పులకు కూడా దరఖాస్తు అందుబాటులో ఉంది. పత్రాలు, వివరాలతో కూడిన దరఖాస్తును అప్‌లోడ్ చేస్తే ఈఆర్ఓకు చేరుతుంది. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవచ్చు. ఇ-ఎపిక్ కార్డును పొందవచ్చు.

వీడియో ఫ్యూయింగ్ టీం, వీడియో సర్వే లైన్ టీంలతో పాటు ఇతర బృందాలు కూడా ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం అవుతున్నాయి. 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు.

# చంద్రబాబు అరెస్ట్‌లో రాజకీయ కక్ష



తిరుపతి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టులో రాజకీయ కక్ష ఉందని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అమాయకుడని.. ఆయన ఏ తప్పు చేయలేదని తాను నమ్ముతున్నాని..ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్ట్ దుర్మార్గమైన చర్య అని చెప్పుకొచ్చారు. న్యాయస్థానాలపై ప్రజలకు విశ్వాసం తగ్గుతోందన్నారు. చంద్రబాబు కేసులో రుజువులు ఎక్కడ ఉన్నాయి.. చూపించండి అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టులో బీజేపీ ఢిల్లీ పెద్దల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజాస్వామ్యవాదులు నోరు విప్పాలన్నారు. న్యాయస్థానాలపై నమ్మకం కోల్పోతున్న పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలన్నారు. న్యాయస్థానాల్లో రాజకీయ ప్రమేయంపై సుప్రీంకోర్టు సీజే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్గదర్శిపై కక్ష సాధింపు ఎందుకని అన్నారు. వయస్సుపైబడిన రామోజీరావుపై అక్రమ కేసులెందుకని నిలదీశారు. పాత పెన్షన్ విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలన్నారు. ఇండియన్ పొలిటికల్ సర్వీసా.. ఇండియన్ పోలీస్ సర్వీసా...అని ప్రశ్నించారు.

పాలస్తీనాలోని గజి ప్రాంతంలో జరిగిన బాంబు దాడిలో 500 మంది మరణించడం బాధాకరమన్నారు. బాంబు దాడులకు కారణమైన అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను నరేంద్రమోడీ పొగడటం దారుణమన్నారు. త్వరలో జరుగనున్న నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని చింతామోహన్ ధీమా వ్యక్తం చేశారు.

# కర్రలతో వెంటపడుతూ రెచ్చిపోయిన వైసీపీ ఎమ్మెల్యే..



కృష్ణా: కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వైసీపీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఇంటి వద్ద టీడీపీ, జనసేన చేపట్టిన మహాధర్నా హింసాత్మకంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో వైసీపీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఇంటిని జనసేన, టీడీపీ కార్యకర్తలు చుట్టుముట్టారు. ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్యే రెచ్చిపోయారు.

పెద్ద సంఖ్యలో జనసేన టీడీపీ కార్యకర్తలు చేరుకోవడంతో వారిపై కర్ర తీసుకుని వెంటపడ్డారు. న కార్యకర్తలతో కలిసి టీడీపీ, జనసేనపై బూతులతో రమేష్‌బాబు విరుచుకుపడ్డారు. దీంతో ఎమ్మెల్యేకు జనసేన, టీడీపీ నేతలకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరసింహారావు జనసేన కార్యాలయం వరకు కర్రలతో వెళ్లి మరీ దాడి చేశారు. వైసీపీ ఎమ్మెల్యే తీరుపై జనసేన, టీడీపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు కూడా ఎమ్మెల్యే వ్యవహారంపై మండిపడుతున్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించలేని ఎమ్మెల్యే వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాగా.. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అవనిగడ్డ వచ్చి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.93 కోట్ల వరాలు కురిపించి నేటికీ సంవత్సరం పూర్తి అయిన నేపథ్యంలో హామీల అమలు ఎప్పుడు అంటూ తెలుగుదేశం జనసేన పార్టీలు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కార్యాలయం ఎదుట మహా ధర్నాకు టీడీపీ, జనసేన పార్టీలు పిలుపునిచ్చాయి. అయితే 144 వ సెక్షన్ అమలులో ఉందని ధర్నాకు అనుమతులు లేవని పోలీసులు ఇప్పటికే మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సహా నియోజకవర్గ తెలుగుదేశం నేతలకు నిన్ననే నోటీసులు జారీ చేశారు. బుద్ధప్రసాద్ సహా పలువురు తెలుగుదేశం, జనసేన నేతలను ఇళ్ళ వద్ద నిర్బంధించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ఇంటికి వెళ్ళే అన్ని దారుల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. వందల మందితో కూడిన ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. అయితే పోలీసులు ఎన్ని అడ్డంకులు పెట్టినా మహాధర్నా నిర్వహించి తీరుతామని తెలుగుదేశం, జనసేన నేతలు స్పష్టం చేస్తున్నారు. సామాన్యుడు నిత్యావసరాల కోసం బయటకు రావాలన్నా పోలీస్ ఆంక్షలు తప్పకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ధర్నా అంటూ ఎవరైనా బయటకు వస్తే అరెస్టులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు నిన్న అవనిగడ్డ మండలం ఎడ్లంక వద్ద ఇరుపార్టీలు చేపట్టిన జల దీక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన రావడం అధికార పక్షానికి మింగుడు పడని అంశంగా మారింది.




విజయవాడ : ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని కాన్వాయ్‌కి స్వల్ప ప్రమాదం జరిగింది. కనకదుర్గ అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం నాని కుటుంబసమేతంగా వచ్చారు. దుర్గమ్మ గుడి నుంచి తిరిగి వెళ్లేటప్పుడు వినాయకుడి గుడి దగ్గర సిమెంట్ బారికేడ్‌ను కొడాలి కారు ఒక్కసారిగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన కారులోనే కొడాలినానితో పాటు ఆయన కుటుంబసభ్యులు ఉన్నారు. చిన్నప్రమాదం కావడంతో పోలీసులు, భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తతో పెద్ద ప్రమాదమే తప్పిందని తెలుస్తోంది. ప్రమాదం అనంతరం అదే కారులోనే గుడికి వెళ్లారని ఆయన అభిమానులు చెబుతున్నారు. మరోవైపు.. విజయవాడ వైసీపీ నేతలు, వీరాభిమానులు కొందరు కొడాలికి ఫోన్ చేసి ప్రమాదంపై అడిగి తెలుసుకున్నారు.

**నిన్న అలా.. ఇవాళ ఇలా..!** కాగా.. గురువారం నాడు కొడాలి నాని ఇంట్లో శుభకార్యం జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య ఘనంగా నాని మేనకోడలి పెళ్లి వేడుక జరిగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి కూడా హాజరయ్యారు. కంకిపాడు అయాన కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుక జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం ఇవాళ గుడికి వెళ్లగా ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు, నాని వీరాభిమానులు షాక్ తిన్నారు. అయితే పెద్ద ప్రమాదం ఏమీ జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# ఒంగోలు భూ కుంభకోణం.. ప్రకాశం ఎస్పీకి సీఎంవో నుంచి పిలుపు

అమరావతి: ప్రకాశం జిల్లా ఒంగోలులో భూ కుంభకోణం సంచలనంగా మారిన నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి పిలుపొచ్చింది. భూ కుంభకోణంపై పూర్తి వివరాలతో రావాలని సీఎంవో అధికారులు ఎస్పీకి సమాచారమిచ్చారు. దీంతో సంబంధిత దస్త్రాలతో మలికా గార్గ్ బయల్దేరారు. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులతో ప్రైవేటు భూములపై అక్రమ లావాదేవీలు జరిగాయన్న బాధితుల ఫిర్యాదుతో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దర్యాప్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కేసు అధికార వైకాపా ముఖ్యనేతలు, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మధ్య పోరుగా మారింది.

ఈ క్రమంలో ఇటీవల బాలినేని తన గన్‌మెన్లను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. మరోవైపు ఇదే విషయంపై బాలినేని గురువారం సీఎంవోకు వెళ్లారు. ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డిని కలిసి ఈ కేసు సంగతి తేల్చేలా జిల్లా అధికారులను ఆదేశించాలంటూ పట్టుబట్టినట్లు తెలిసింది. 'నా పక్కనుండేవారైనా, పార్టీ (వైకాపా) మనుషులైనా.. కేసులో ఎవరున్నా సరే అరెస్టు చేయండి.




జిల్లా కలెక్టర్, ఎస్పీలకు చెప్పినా వారు స్పందించడం లేదు. అనవసరంగా నేను విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికారుల తీరు వల్లే నా గన్‌మెన్లను సరెండర్ చేశా' అని ధనుంజయ రెడ్డికి బాలినేని చెప్పినట్లు సమాచారం. బాలినేని వ్యవహారంతో పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోందనే ఉద్దేశంతో ఆయన్ను పిలిచి మాట్లాడాలని ముఖ్యమంత్రి చెప్పడంతో తాడేపల్లికి పిలిపించారని సీఎంఓ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లా ఎస్పీకి సీఎంవో నుంచి పిలుపు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.




భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత ముదిరేలా కన్పిస్తున్నాయి. భారత్‌లో తమ దౌత్య సిబ్బందిని తగ్గించుకున్నట్లు అధికారికంగా ప్రకటించిన కెనడా.. ఆ కాసేపటికే భారత్‌లోని తమ దేశ పౌరులు అప్రమత్తంగా ఉండాలంటూ అడ్వైజరీ జారీ చేసి మరోసారి కవ్వింపులకు పాల్పడింది. మరోవైపు సిబ్బందిని తగ్గించిన నేపథ్యంలో ముంబయి, బెంగళూరు, చండీగఢ్‌లో అన్ని రకాల ఇన్-పర్సన్ సేవలను నిలిపివేసినట్లు ప్రకటించింది.

**వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు..** "ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో.. భారత్‌లో మీడియా, సామాజిక మాధ్యమాల్లో కెనడాపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే కెనడా-వ్యతిరేక ఆందోళనలు, ప్రదర్శనలు జరిగే అవకాశాలున్నాయి. కెనడియన్లపై బెదిరింపులు, వేధింపులు జరగొచ్చు. అందువల్ల దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులతో మీరు (కెనడియన్లు) జాగ్రత్తగా ఉండండి. వారికి ఎలాంటి వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు.

బెంగళూరు, చండీగఢ్, ముంబయిల్లోనూ అత్యంత జాగ్రత్తగా ఉండండి. ఇక, సాధారణంగా పెద్ద నగరాల్లో విదేశీయులు, పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కొందరు చోరీలకు పాల్పడుతుంటారు. అందుకే, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండండి" అని కెనడా తమ అడ్వైజరీలో పేర్కొంది.

**ఆ నగరాల్లో వీసా, కాన్సులర్ సేవలు నిలిపివేత..** ఇక, దౌత్య సిబ్బందిని ఉపసంహరించుకున్న దృష్ట్యా.. బెంగళూరు, ముంబయి, చండీగఢ్ నగరాల్లో అన్ని రకాల ఇన్-పర్సన్ సేవలను నిలిపివేస్తున్నట్లు కెనడా తన అడ్వైజరీలో వెల్లడించింది. దీంతో ఈ నగరాల్లో వ్యక్తిగత వీసా, కాన్సులర్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లోని కెనడియన్లు ఏదైనా అవసరమైతే దిల్లీలోని కెనడా హై కమిషన్‌ను సంప్రదించాలని సూచించింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇదే సమయంలో భారత అంతర్గత విషయాల్లో కెనడా దౌత్యవేత్తలు అతిగా జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ.. దౌత్య సిబ్బంది సంఖ్య విషయంలో సమస్థాయిని పాటించాలని సూచించింది. ఈ క్రమంలోనే కెనడా తమ దౌత్య సిబ్బందిని తగ్గించుకోవాలని న్యూదిల్లీ అల్టిమేటం జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే భారత్ నుంచి 41 మంది దౌత్యసిబ్బందిని వెనక్కి రప్పించినట్లు కెనడా తాజాగా అధికారికంగా ప్రకటించింది.




యెమన్ తీరం నుంచి ఇరాన్ మద్దతున్న హౌతి మిలిటెంట్లు ఇజ్రాయెల్ దిశగా ప్రయోగించిన క్షిపణులను అమెరికా యుద్ధ నౌక కూల్చేసింది. ఈ విషయాన్ని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ పాట్ రైడర్ వెల్లడించారు. యూఎస్ఎస్ కార్నీ సుమారు మూడు క్షిపణులను గాల్లోనే పేల్చేసిందన్నారు.


దీంతోపాటు పలు డ్రోన్లను కూడా హౌతి మిలిటెంట్లు ప్రయోగించారని వివరించారు. "ఈ ఘటనతో మధ్యప్రాశ్చ్యంలో మేము సిద్ధం చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఎంత కచ్చితత్వంతో పనిచేస్తున్నాయో తెలిసింది. ఆ ప్రాంతంలో తలెత్తే ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొని మా, మా భాగస్వాముల ప్రయోజనాలను కాపాడతాం. తాజా ఘటనలో మా దళాలకు ఎటువంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. అటువైపు నష్టం ఏమైనా జరిగిందో తెలియలేదు" అని రైడర్ పేర్కొన్నారు. వారు కచ్చితంగా ఎటువంటి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించారో తెలియాల్సి ఉంది. ఈ క్షిపణులు యెమన్ భూభాగం నుంచి ఇజ్రాయెల్‌లో లక్ష్యాల దిశగా వెళుతున్నట్లు భావిస్తున్నామని ఆయన చెప్పారు. యూఎస్ఎస్ కార్నీ గురువారం సూయజ్ కాల్వ మీదుగా ఎర్ర సముద్రంలోకి వచ్చింది.

**ఏమిటీ ద్విదేశ పరిష్కారం!** సిరియాలోని అల్-తన్ఫ్ సైనిక స్థావరంపై బుధవారం డ్రోన్ల దాడి జరిగిందని పెంటగాన్ ప్రతినిధి వెల్లడించారు. ఒక డ్రోన్‌ను తాము కూల్చేశామని.. మరో డ్రోన్ మాత్రం తమ స్థావరంపై దాడి చేయడంతో సంకీర్ణ సేనల సిబ్బందిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయని వెల్లడించారు. ఇక ఇజ్రాయెల్-హమాస్ సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ సౌదీ, యూఏఈ, కతర్ నేతలతో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు. ఈ సంక్షోభంలో ఏ దేశమైనా తలదూర్చాలని యత్నించే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని రైడర్ హెచ్చరించారు.

# లీగల్ ములాఖత్‌ల పెంపు పిటిషన్‌ను తిరస్కరించిన ఏసీబీ కోర్టు

విజయవాడ: తెదేపా అధినేత చంద్రబాబును కలిసేందుకు లీగల్ ములాఖత్‌లను పెంచాలంటూ ఆయన తరఫు న్యాయవాదు దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ప్రతివాదుల పేర్లు చేర్చనందున ఇప్పుడు విచారణ అవసరం లేదని న్యాయాధికారి తెలిపారు. రోజుకు ఒకసారి మాత్రమే చంద్రబాబుతో న్యాయవాదుల ములాఖత్‌కు కోర్టు అనుమతించింది.

న్యాయవాదులకు ఇచ్చే రోజుకు రెండు ములాఖత్‌లను జైలు అధికారులు ఒకటికి కుదించారరని చంద్రబాబు తరఫు న్యాయవాదులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏసీబీ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులు విచారణ జరుగుతున్న నేపథ్యంలో రోజుకు మూడు ములాఖత్‌లు ఇప్పించాలని కోరారు. కనీసం 45-50 నిమిషాలు



చర్చించేందుకు అవకాశం ఇచ్చేలా జైలు అధికారులను ఆదేశించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది.

# ఐఏఎస్ శ్రీలక్ష్మిపై పోలీసులకు రాజధాని రైతుల ఫిర్యాదు



అమరావతి: ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మిపై రాజధాని రైతులు తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూములిచ్చిన రైతులకు మే నెల మొదటివారంలో చెల్లించాల్సిన కౌలును దసరా వచ్చినా చెల్లించనందున చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిధుల విడుదలకు జీవో జారీ అయినా రైతుల అకౌంట్లలో డబ్బులు వేయకపోవటాన్ని తప్పుబడుతూ సీఆర్పీసీ 166 ప్రకారం ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. మొత్తం 22,948 రైతులకు సుమారు రూ.183.17 కోట్లు చెల్లించాల్సి ఉందని ఫిర్యాదులో రాజధాని రైతులు వివరించారు.

# 'ఏపీ హేట్స్ జగన్'.. పుస్తకాన్ని విడుదల చేసిన తెదేపా



అమరావతి: నవరత్నాల పేరుతో నవమోసాలు చేస్తున్న జగన్‌రెడ్డికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని తెదేపా హెచ్చరించింది. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో 'ఏపీ హేట్స్ జగన్' పుస్తకాన్ని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఇతర నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నేతలు మీడియాతో మాట్లాడారు. 52 నెలల వైకాపా పాలనలో ఒక్కో కుటుంబంపై జగన్ లక్షలాది రూపాయల భారం మోపారని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీల భారమే రూ.64 వేల కోట్లని మండిపడ్డారు. నాసిరకం మద్యంతో 35 లక్షల మందిని రోగాల బారిన పడేలా చేశారని..30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. మద్యం ద్వారా వచ్చిన ఆదాయంలో తాడేపల్లి ప్యాలెస్ లక్ష కోట్ల కమీషన్ కొట్టేసిందని దుయ్యబట్టారు. తన దోపిడీని ఎదుటివారికి అంటగట్టి.. చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం జగన్ రెడ్డి నైజమని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చానని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. జగన్ నెరవేర్చని హామీల లిస్టు చాంతాడంత ఉందని.. ఎప్పుడెప్పుడు వదిలించుకుందామా అని ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

## స్వలింగ సంపర్కం.. సుప్రీం తీర్పుపై మంచు లక్ష్మి నిరాశ!

మగ-మగ.. ఆడ-ఆడ పెళ్లి కుదరదని తీర్పు వెలువరించింది సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్. స్వలింగ సంపర్కుల వివాహాన్ని చట్టబద్ధం చేయలేమనేది సుప్రీం తీర్పు సారాంశం. అయితే ఇది కొందరికి రుచించడం లేదు. ముఖ్యంగా సెలబ్రిటీలు దీనిని ఖండిస్తున్నారు. తాజాగా మంచు లక్ష్మి ఈ తీర్పుపై తన నిరాశను వ్యక్తం చేసారు. ఒకే జెండర్ వివాహాల్ని సుప్రీంకోర్టు చట్టబద్ధం చేయకపోవడం తనను తీవ్రంగా నిరాశపరిచిందని, అన్ని రకాల ప్రేమను భారతదేశంలో అంగీకరించకపోవడం సిగ్గు చేటు అని కూడా వ్యాఖ్యానించారు. ఇతర కమ్యూనిటీలు ఎవరికి వారు స్వేచ్ఛగా తమ లవ్ లైఫ్ ని కొనసాగిస్తారు. కానీ మన దేశంలో స్వలింగ సంపర్కుల ప్రేమను అంగీకరించలేమా? అని ప్రశ్నించారు. అసలు సుప్రీం ఏమని తీర్పు వెలువరించింది? అంటే.. ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు బెంచ్ %ూా+దీూ×ూా%ం జంటలకు వివాహానికి సంపూర్ణ హక్కు లేదని నిర్ధారించింది. అయితే ఈ తీర్పు క్వీర్ వ్యక్తులు సంబంధాలను ఏర్పరచుకోకుండా నిరోధించదని కోర్టు నొక్కి చెప్పింది. అంతేకాకుండా అండర్-క్లాసిఫికేషన్ ఆధారంగా



స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌కి సవాల్ చేయడం సబబు కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఒక మధ్యంతర పరిష్కారంలో నిర్దిష్ట పౌర సంఘాలను గుర్తించి, వాటికి వివాహానికి సమానమైన హోదాను ఇవ్వకుండా, ప్రత్యేకమైన దత్తత ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయాలనే సూచన కూడా చేయడం ఆసక్తికరం. అలాగే హిజ్రాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, పార్లమెంటు రెండూ ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సాయి దీపక్ అనే లాయర్ ప్రతిపాదించారు.

**ముంబైకి షిఫ్టింగ్ నిజమేనా?** నటి-కమ్-నిర్మాత మంచు లక్ష్మి వృత్తిపరమైన కారణాల వల్ల ముంబైకి మకాం మార్చారని ప్రచారం సాగుతోంది. లక్ష్మి మంచు.. వరుసగా సినిమాలు, వెబ్ సిరీస్‌లలో పాత్రల కోసం ఆడిషన్స్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని ప్రచారం ఉంది. మరోవైపు రకుల్ ప్రీత్ సింగ్, రియా చక్రవర్తి సహా పలువురు ముంబై కథానాయికలకు లక్ష్మీ మంచు మంచి స్నేహితులు. రకుల్ తన కాబోయే భర్త జాకీ భగ్నానీతో కలిసి ముంబైలో నివసిస్తోంది. ముంబయిలోని ఫ్యాన్సీ డైనర్‌లలో రకుల్- లక్ష్మీ మంచు చాలాసార్లు కలుసుకున్నారు. ముంబైలో ఉన్నప్పుడు ఆమె తరచుగా రియా చక్రవర్తితో కలిసి పని చేస్తుంది. లక్ష్మికి మంచి సర్కిల్ ఉంది. ఆమె ఈసారి సరైన అవకాశాలను ఛేజిక్కించుకోబోతున్నారని సమాచారం. లక్ష్మి మంచు ఇటీవల ఓ చాటింగ్ సెషన్ లో మాట్లాడుతూ, -"కొత్త నగరం, కొత్త దశ .. దీని గురించి నేను చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను నమ్మి నన్ను ఆదరించినందుకు నా అభిమానులకు ధన్యవాదాలు. నేను దక్షిణాదిలో పనిచేయడం ఇష్టపడతాను. కానీ అక్కడ కొన్ని పరిమితులు ఉన్నాయి. నేను వృత్తిపరమైన కారణాలతో మాత్రమే మకాం మార్చాను. ఇక్కడ అవకాశాలు చాలా ఎక్కువ. నేను ఆడిషన్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను" అని తెలిపారు.

## దర్శకుడితో శ్రీలీల పర్సనల్ రిలేషన్!

ప్రస్తుతం టాలీవుడ్ లో హీరోయిన్ అనగానే ఎక్కువ శాతం మంది శ్రీలీల పేరునే గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అంతటి క్రేజ్ మరియు అంతటి స్టార్ డమ్ దక్కించుకున్న ముద్దుగుమ్మ శ్రీలీల గురించి ఎప్పటికప్పుడు ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో వరుస సినిమాల తో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్న శ్రీలీల పర్సనల్ విషయాల వల్ల కూడా వార్తల్లో ఉంటుంది. శ్రీలీల చేతిలో ప్రస్తుతం పది ఉన్నాయి. అందులో అర డజను సినిమాల షూటింగ్ జరుగుతున్నాయి. కొన్ని సినిమాల షూటింగ్ లు పూర్తి అవ్వగా కొన్ని సినిమాల షూటింగ్ లు ఇంకా మొదలు అవ్వలేదు. ప్రస్తుతం అందరి దృష్టి కూడా శ్రీలీల కీలక పాత్ర లో నటించిన బాలకృష్ణ 'భగవంత్ కేసరి' సినిమా పై ఉంది అనడం లో ఎలాంటి సందేహం లేదు. శ్రీలీల కూడా ఆ సినిమా పై చాలా ఆశలు పెట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. నటిగా శ్రీలీలకు ఆ సినిమా కచ్చితంగా



మంచి గుర్తింపును తెచ్చి పెడుతుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ శ్రీలీల పాత్రను డిజైన్ చేశాడు అంటూ చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. కనుక నటిగా ఈ సినిమా శ్రీలీలకి మంచి గుర్తింపును తెచ్చ పెడుతుందట. సినిమా విడుదల సమయంలో దర్శకుడు అనిల్ రావిపూడి మరియు హీరోయిన్ శ్రీలీల గురించి ఆసక్తికర పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దర్శకుడు అనిల్ ని శ్రీలీల మామ అంటూ పిలిచేదట. సెట్ లో అందరు ఉన్నప్పుడు సర్ అంటూ పిలిచి... పర్సనల్ గా మాత్రం మామ అంటూ పిలిచేదట. ఇద్దరు కూడా చాలా క్లోజ్ గా ఉండే వారని చూసిన వారు చెబుతున్నారు. శ్రీలీల తల్లి ఊరు మరియు అనిల్ రావిపూడి ఊరు ఒకటే. పుట్టి పెరిగింది మొత్తం కూడా బెంగళూరులో అయినా కూడా శ్రీలీల ఏడాదికి ఒకటి రెండు సార్లు తప్పకుండా తన అమ్మమ్మ ఇంటికి వచ్చేది. అలా దర్శకుడు అనీల్ రావిపూడితో సాన్నిహిత్యం ఏర్పడిందనే వార్తలు వస్తున్నాయి. పైగా శ్రీలీల తల్లి మరియు అనిల్ రావిపూడి కజిన్స్ అవుతారట. అందుకే శ్రీలీల అనిల్ ను మామ అని పిలుస్తుందని అంటున్నారు. తల్లి ద్వారా ఏర్పడిన రిలేషన్ తప్ప.. ఇద్దరి మధ్య అంతకు మించి ఏమీ లేదు అనేది కొందరి మాట. మొత్తానికి శ్రీలీల మామ అంటూ అనిల్ ని సంభోధించడం చర్చనీయాంశం గా మారింది. ఇద్దరిలో ఎవరైనా ఈ విషయమై క్లారిటీ ఇస్తారేమో చూడాలి.




## 500 కోట్ల క్లబ్‌లో టాప్- 5 హీరోయిన్స్



వరుసగా బాక్సాఫీస్ వద్ద 500కోట్ల క్లబ్‌లు, 1000 కోట్ల క్లబ్ లు సాధ్యమవుతున్నాయి. బాహుబలి - బాహుబలి 2- దంగల్- ఆర్.ఆర్.ఆర్ -2.0- పద్మావత్- కేజీఎఫ్ 2- పఠాన్- జవాన్- జైలర్- గదర్ 2 చిత్రాలు 500కోట్ల క్లబ్ లు అందుకున్నాయి. వీటిలో మెజారిటీ సినిమాలు 1000 కోట్ల క్లబ్ లోను చేరాయి. ప్రభాస్, అమీర్ ఖాన్, యష్- షారూఖ్ ఖాన్- రామ్ చరణ్- ఎన్టీఆర్ లాంటి స్టార్లు 1000కోట్ల క్లబ్ హీరోలు అయ్యారు. 2.0, జైలర్ చిత్రాలతో రజనీకాంత్ 500కోట్ల క్లబ్ లో చేరారు. ఇక కథానాయికల్లో 500 కోట్ల క్లబ్ సినిమాల్లో నటించినది ఎందరు? అన్నది ఆరా తీస్తే తెలిసిన సంగతులివి. భారతీయ సినిమా చరిత్రలో సుమారు డజను మంది కథానాయికలు 500 కోట్ల క్లబ్ లో చేరడం ఆసక్తికరం. అనుష్క, రమ్యకృష్ణ, దీపిక పదుకొనే, ఫాతిమా సనాషేక్, సన్య మల్హోత్రా, శ్రీనిధి శెట్టి, ఆలియా భట్, ఎమీజాక్సన్, నయనతార- అమీషా పటేల్.. ఇలా కొందరు కథానాయికలు 500 కోట్ల క్లబ్ సినిమాల్లో నటించారు. ఇందులో కొందరు 1000 కోట్ల క్లబ్ నాయికలు అయ్యారు. బాహుబలి ఫ్రాంఛైజీతో అందాల కథానాయికలు అనుష్క శెట్టి, రమ్యకృష్ణ 500కోట్ల క్లబ్ లో చేరారు. తమ అందం నటనతో దశాబ్ధాల పాటు ఏలిన ఈ భామలు రికార్డ్ బ్రేకింగ్ చిత్రాలతో చరిత్రలో నిలిచారు. బాహుబలి 2 చిత్రం 1000 కోట్లు పైగా వసూలు చేయడంతో ఆ ఇద్దరు కథానాయికలను 1000 కోట్ల క్లబ్ నాయికలుగా పిలవొచ్చు. దంగల్ సినిమాతో ఫాతిమా సనాషేక్, సన్య మల్హోత్రా 500 కోట్ల క్లబ్, 1000 కోట్ల క్లబ్ నటీమణులు అయ్యారు. అమీర్ నటించిన ఈ సినిమా ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా. ఇందులో ఫాతిమా, సన్య అథ్లెట్లుగా నటించారు. వారి నటనకు గొప్ప పేరొచ్చింది. ఆ తర్వాత కథానాయికలుగా బాలీవుడ్ లో ఆ ఇద్దరూ ఎదిగారు. కేజీఎఫ్ 2లో కథానాయికగా నటించిన శ్రీనిధి శెట్టి కెరీర్ ఆశించిన స్థాయిలో రాణించకపోయినా తను కూడా 500 కోట్ల క్లబ్ నాయిక. కేజీఎఫ్ 2 చిత్రం 1000 కోట్ల క్లబ్ లోను చేరింది. ఆర్.ఆర్.ఆర్ లో నటించిన ఆలియాభట్ 1000 కోట్ల క్లబ్ నాయిక. ఆలియా భారతదేశంలోనే అగ్ర కథానాయికగా రాణిస్తోంది. 2.0 చిత్రంలో నటించిన ఎమీజాక్సన్ 500 కోట్ల క్లబ్ నాయిక. రజనీకాంత్ కెరీర్ లో కాస్ట్ ఫెయిల్యూర్ గా నిలిచిన ఈ చిత్రం అద్భుత వసూళ్లను సాధించినా చాలా చోట్ల పంపిణీదారులకు నష్టాలొచ్చాయి. ఈ చిత్రంలో నటించిన రజనీకాంత్, ఎమీజాక్సన్, అక్షయ్ కుమార్ లకు గొప్ప పేరొచ్చింది. పఠాన్ - జవాన్ చిత్రాలతో దీపిక పదుకొనే 500 కోట్ల క్లబ్ తో పాటు, 1000 కోట్ల క్లబ్ లో చేరింది. జవాన్ చిత్రంతో అందాల నయనతార 1000 కోట్ల క్లబ్ అందుకుంది. నయనతార సౌతిండియా సూపర్ స్టార్ గా ఏల్తోంది. ఇప్పుడు ఉత్తరాదినా నయన్ సంచలనాలు మొదలయ్యాయి. ఇక 500 కోట్ల క్లబ్ లో చేరిన జైలర్ చిత్రంలో స్పెషల్ నంబర్ లో కనిపించిన తమన్నా బాహుబలి ఫ్రాంఛైజీలోను నటించడం ఆసక్తికరం. సన్నీడియోల్ నటించిన గదర్ 2 చిత్రం 500 కోట్లు పైగా వసూలు చేసింది. ఇందులో నటించిన అమీషా పటేల్ కి పేరొచ్చింది. అమీషా ఇప్పుడు 500 కోట్ల క్లబ్ నాయిక. దాదాపు డజను మంది కథానాయికల పేర్లు ఇప్పటికే 500 కోట్ల క్లబ్ లో చేరాయి.

## టైగర్ 3 ట్రైలర్ టాక్.. దేశమా? కుటుంబమా?



యష్ రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ కథలను రాబోయే రోజుల్లో మరింత గ్రాండ్ గా తెరపైకి తీసుకు రావడానికి ప్రయత్నాలు అయితే చేస్తున్నారు. %=ూాౖ% ఎజెంట్స్ తో కూడిన ఇక ఈ యూనివర్స్ ను మొదట స్టార్ట్ చేసిన సినిమా మాత్రం ఏక్తా టైగర్. తర్వాత వచ్చిన టైగర్ జిందా హై కూడా బాక్స్ ఆఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకుంది. ఒక స్పైగా సల్మాన్ ఖాన్ తన పాత్రతో బాక్సాఫీస్ వద్ద రికార్డులను బ్లాస్ట్ చేశాడు. అయితే ఇప్పుడు ఈ రెండు కథలకు కొనసాగింపుగా మరో కొత్త కథ ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అదే టైగర్ 3. ట్రైలర్ను నేడు గ్రాండ్ గా విడుదల చేశారు. పాన్ ఇండియా సినిమాగా ఈ సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నారు. ఇక తెలుగులో కూడా సినిమా ట్రైలర్ విడుదల చేశారు. దేశంలో శాంతికి దేశంలోని శత్రువులకే మధ్య ఎంత దూరం ఉంటుంది? కేవలం ఒక మనిషి అంత.. అనే డైలాగ్ తో మొదలైన ఈ సినిమా ట్రైలర్ లో సల్మాన్ ఖాన్ ఎప్పటిలానే తన యాక్షన్ ఎలిమెంట్స్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. సినిమా మొత్తం కూడా వేరే ప్రపంచంలోకి తీసుకు వెళ్లే విధంగా ఉండబోతున్నట్లు హైలెట్ అయింది. ఇక ఈసారి శత్రువుల నుంచి దేశాన్ని రక్షించుకోవడమే కాకుండా టైగర్ తన కుటుంబాన్ని కూడా ఎలా రక్షించుకున్నాడు అనే పాయింట్ తో కదా ఎలివేట్ కాబోతోంది. సల్మాన్ ఖాన్ కి జోడిగా కత్రినా కైఫ్, ఒక బాబు ఎమోషన్ తో ఈసారి టైగర్ కథను మరింత డ్రామాగా వీక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాడు దర్శకుడు మనీష్ శర్మ. ఇక సినిమాలో యాక్షన్కు ఏమాత్రం కొదవలేదు. భార్య ప్రేమ పిల్లల సంతోషంలో ఉన్న హీరోకు శత్రువు అదే సంతోషాన్ని అతనికి దూరం చేయాలి అని ఆలోచిస్తూ ఉంటాడు. అతని మీద దేశద్రోహం ముద్రపడేలా చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లుగా అర్థమవుతుంది.

ఇక సల్మాన్ కు దెబ్బ కొట్టే పవర్ఫుల్ విలన్ గా ఇందులో ఇమ్రాన్ హష్మీ నటించాడు. ఇక అనుకున్న మిషన్ ను హీరో ఎలా చేదించాడు. అలాగే తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు అని అంశాలు సినిమాలో హైలెట్ కాబోతున్నాయి. హీరోయిన్ కత్రినా కూడా జోయా పాత్రలో మరోసారి సరికొత్తగా ఆకట్టుకుబోతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ట్రైలర్ అయితే సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెంచింది. బాక్సాఫీస్ వద్ద నవంబర్ 12 నుంచి టైగర్ దాడి చేయబోతున్నాడు. మరి ఎలాంటి రికార్డులు బ్లాస్ట్ అవుతాయో చూడాలి.

## ట్రైబల్ బ్యూటీలా కరిష్మా వెలుగు జిలుగులు!

కరిష్మా తన్నా బాలీవుడ్ లో ఇప్పుడిప్పుడే ఫేమస్ అవుతుంది. వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. ఇప్పటికే ఐదారు సినిమాలు చేసింది. అమ్మడి కెరీర్ ఇప్పుడిప్పుడే మెరుగు పడుతుంది. కెరీర్ ప్రారంభించి ఏళ్లు గుడుస్తున్నా ఐడెంటిటీ కోసం చేయని ప్రయత్నం లేదు. చివరిగా అన్నింటిని తన కంట్రోల్ లోకి తీసుకుంటుంది. ఇక ఛాన్స్ దొరికనప్పుడల్లా ఇన్ స్టాని పైతం ఎప్పటికప్పుడు షేక్ చేస్తుంది. టెంప్టింగ్ ఫోటో షూట్లతో యువత హృదయాల్లో అగ్గి రాజేస్తుంది. తాజాగా అమ్మడి న్యూ ఫోటో షూట్ నెట్టింట వైరల్ గామారింది. ఇదిగో ఇక్కడిలా లెహంగా దుస్తుల్లో అందంగా ముస్తాబైంది. మల్టీకలర్ డిజైన్ లో అమ్మడు మిరుమిట్లు గొలుపుతుంది. ఇక్కడ ప్రత్యేకంగా



కరీష్మా ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ హైలైట్ అవుతున్నాయి. చెవులకు భారీ బుట్టలు ధరించి ముఖాన్ని మరింత అందంగా మార్చేసింది. బుట్టల డిజైన్ బాగుంది. చేతికి ఎంపిక చేసుకున్న మ్యాచింగ్ రింగ్ డిజైన్ ప్రతీది అమ్మడిన స్పెషల్ గా ఫోకస్ గా చేస్తున్నాయి. నేలపై కూర్చుని వివిధ భంగమలో కెమారాకి ఫోజులిచ్చింది.ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఇక కరిష్మాతన్నా సినిమాల విషయానికి వస్తే 'ఫ్రెండ్స్ ఫర్ ఎవ్వెర్' చిత్రంతో బాలీవుడ్ లో లాంచ్ అయిం ది. ఆ తర్వాత ఆరేళ్లు గ్యాప్ తీసుకుంది. అటుపై కన్నడ చిత్ర పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చింది. ఇలా రెండు పరిశ్రమల్లోనూ ఎంట్రీ ఇచ్చినా బ్యూటీని ఎంకరేజ్ చేసే వాళ్లే కరువయ్యారు. మరో రెండేళ్లు విశ్రాంతి తీసు కుని 'గ్రాండ్ మస్తీ' చిత్రంతో బాలీవుడ్ లో మళ్లీ కంబ్యాక్ అయింది. ఆ తర్వాత ఒకటి రెండు సినిమాలు చేసింది. కానీ అవేవి ఐడెంటిటీని తీసుకురాలేదు. ఈ సమయంలో రాజ్ కుమార్ హిరాణీ తెరకెక్కించిన 'సంజు' లో అవకాశం అందుకుంది. ఈ సినిమాతో ఉత్తరాదిన బాగానే ఫేమస్ అయింది. ఆ వెంటనే అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం కెరీర్ పరంగా హ్యాపీ. అయితే నటిగా కన్నా కరిష్మా యాంకర్ గా..హోస్ట్ గా ఉత్తరాదిన ఫేమస్ అయింది. వెండి తెర అవకాశాలు కన్నా బుల్లి తెరపై నిత్యం బిజీగానే ఉంటుంది. పలు వెబ్ సిరీస్ ల్లోనూ నటించింది.

## బీచ్‌లో కాకలు పుట్టిస్తున్న పూజా హెగ్డే

బికినీలు.. స్విమ్ సూట్‌లతో హీటెక్కించడం పూజా హెగ్డేకి కొత్తేమీ కాదు. బుట్ట బొమ్మ అంటూ తెలుగు నాట కీర్తినందుకున్న పూజా అందుకు భిన్నంగా హాటెస్ట్ అవతార్ లతో మతులు చెడగొడుతోంది. గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ఒక రేంజు ఉందని నిరూపించిన పూజా ఇటీవల సోషల్ మీడియాల్లో అగ్గి రాజేస్తోంది. ఇప్పుడు తన 33వ పుట్టినరోజు వేళ మాల్దీవుల వెకేషన్ ని ఒక రేంజులో సెలబ్రేట్ చేస్తోంది. ఇటీవల వరుసగా మాల్దీవుల నుంచి పూజా హెగ్డే బోల్డ్ ఫోటోషూట్లు అంతర్జాలాన్ని హీటెక్కిస్తున్నాయి. మరోసారి ఐల్యాండ్ నుంచి నుంచి యూనిక్ ఫోటోషూట్ ని షేర్ చేసింది. క్షణాల్లో ఈ ఫోటో అందరినీ చుట్టేసింది. ఈసారి పూజా



మరింత స్పైసీ లుక్ తో కట్టి పడేసింది. ఆకుపచ్చ స్విమ్‌సూట్‌లో గుబులు రేపింది. సూర్యుని లేలేత కిరణాలు పూజా అందమైన దేహశిరుల్ని టచ్ చేస్తుండగా, విరబోసిన కురులతో పూజా స్విమ్ సూట్ లో ప్రత్యేకంగా కనిపించింది. ఇది నిజానికి స్లీవ్‌లెస్ మోనోకినీ. పూజ టాన్డ్ స్కిన్.. దానితో పోటీపడుతూ నయగారా వంపులు కుర్రకారు గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి. మునుపటితో పోలిస్తే పూజాలో హాట్ కంటెంట్ పెరిగింది అంటూ దీనిపై నెటిజనులు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. పూజా ఇటీవల టాలీవుడ్ నుంచి దూరమైనా కానీ, బాలీవుడ్ లో వరుస చిత్రాలు చేస్తోంది. ప్రస్తుతం షాహిద్ కపూర్ సరసన ఓ చిత్రం చేస్తోంది.

అధికారికంగా దీనిని ప్రకటించారు. పూజా హెగ్డే బర్త్ డే సందర్భంగా టీమ్ పూజాకు గ్రాండ్ వెల్ కం చెప్పింది.




# సుప్రీంలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ

ఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార బీఆర్ఎస్ పార్టీకి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పిటిషన్ ధర్మాసనం కొట్టేసింది.
ఓటర్లకు అన్నీ తెలుసని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీంతో బీఆర్ఎస్‌కు ఊహించని షాక్ తగిలినట్టయ్యింది. సుప్రీం నిర్ణయంతో బీఆర్ఎస్ అధిష్టానం, ఆ పార్టీ అభ్యర్థులు ఆలోచనలో పడినట్లు తెలిసింది.
**సుప్రీం సీరియస్..** 'భారతీయ ఓటర్లు రాజకీయ నిరక్షరాసులు కాదు. ఓటర్లకు కారు, చపాతి రోలర్, రోడ్డు రోలర్ తేడా తెలియదు అనుకుంటున్నారా?.. ఎన్నికలు వాయిదా వేయాలని మీరు కోరుకుంటున్నారా? హైకోర్టు తీర్పు తర్వాత దాదాపు 240 రోజుల తర్వాత సుప్రీంకోర్టుకు రావడం ఏంటి?. అధికార పార్టీగా ఉన్న మీకు ఈ విషయం తెలియదా?' అంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయవాదులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.
**అసలేం జరిగింది..?** కాగా.. కారును పోలిన గుర్తులను తొలగించాలంటూ న్యాయస్థానంలో బీఆర్ఎస్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. చపాతీ రోలర్, రోడ్డు రోలర్, తదితర గుర్తులను ఎన్నికల్లో ఎవరికీ కేటాయించకుండా ఎన్నికల సంఘానికి ఆదేశించాలంటూ బీఆర్ఎస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మునుగోడు ఉప ఎన్నికలో కారును పోలిన గుర్తులతో నష్టపోయామని పిటిషన్‌లో పేర్కొంది. విచారణ చేపట్టిన ధర్మాసనం బీఆర్ఎస్ పిటిషన్‌ను కొట్టేసింది. ఓటర్లకు అన్ని విషయాలు తెలుసని కోర్టు వ్యాఖ్యానించింది.



# మంత్రి కేటీఆర్ సమక్షంలో భారాసలో చేరిన రావుల చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్: తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి భారాసలో చేరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారాస మళ్లీ గెలిస్తే.. రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామన్నారు. రైతుబంధు కింద రూ.73వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసినట్లు చెప్పారు. "రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల్లోపు మిగిలిన అందరికీ రుణమాఫీ పూర్తి చేస్తాం. 13 లక్షల మంది ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి ఇచ్చాం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు వైద్య కళాశాలలు ఏర్పాటు చేశాం. గురుకులాల్లో 6.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు." అని కేటీఆర్ వివరించారు. 55 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లా పచ్చబడుతుంటే ప్రతిపక్షాల కళ్లు ఎర్రబడుతున్నాయని విమర్శించారు. " ఒకప్పుడు మైగ్రేషన్‌కు కేరాఫ్‌గా ఉన్న పాలమూరు ఇవాళ ఇరిగేషన్‌కు కేరాఫ్‌గా మారింది.
సముద్రతీరం లేకుండా మత్స్య సంపద పెరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణదే నెంబర్‌వన్ స్థానం. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నాం" అని కేటీఆర్ తెలిపారు.




# ప్రగతిభవన్‌కు ఈసీ నోటీసులు.. దేనికోసమంటే..!

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల ప్రకటన వెలువడిన దగ్గర నుంచి రాష్ట్రంలో కోడ్ అమల్లోకి వచ్చింది. అన్ని పార్టీల కార్యక్రమాలపై ఎన్నికల అధికారులు దృష్టిపెట్టారు. ఇప్పటికే తనిఖీల్లో కోట్లలో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
అలాగే పార్టీల ఫిర్యాదులపై కూడా ఈసీ తక్షణమే స్పందిస్తోంది. తాజాగా ప్రగతిభవన్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ముఖ్యమంత్రి అధికారిక భవన్‌లో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈసీకి కాంగ్రెస్ కంప్లైంట్ చేసింది. ఇదే అంశంపై నిన్న సాయంత్రం సీఈవో వికాస్‌రాజుతో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ భేటీ అయ్యారు. ప్రగతిభవన్‌పై వచ్చిన ఫిర్యాదుపై అధికారులంతా చర్చించారు. ఎవరికి నోటీసులు ఇవ్వాలన్న అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ప్రగతిభవన్ నిర్వహణ అధికారికి ఈసీ నోటీసులు పంపించింది. ప్రగతిభవన్‌లో జరుగుతున్న కార్యక్రమాలపై ఈసీ వివరణ కోరింది.




జగిత్యాల: భారాస, భాజపా ఒక్కటేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి భారాస మద్దతు ఇస్తోందని ఆరోపించారు. లోక్‌సభలోని అన్ని బిల్లులకూ ఆ పార్టీ మద్దతిచ్చిందని చెప్పారు. బస్సు యాత్రలో భాగంగా జగిత్యాలలో నిర్వహించిన విజయభేరి సభలో రాహుల్ పాల్గొని మాట్లాడారు. "గతంలో లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యాక దిల్లీలోని నా ఇంటిని ఖాళీ చేయించారు. కానీ నా ఇల్లు.. దేశ ప్రజల హృదయాల్లో ఉంది. బలహీనవర్గాల జనాభా లెక్కలు ఉండాలని కేంద్రాన్ని కోరాను. ఓబీసీలు దేశానికి వెన్నెముక లాంటివారు. వారికి రిజర్వేషన్లు ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఓబీసీలకు అండగా నిలిచేందుకు మోదీ, కేసీఆర్ సిద్ధంగా లేరు. ఓబీసీల సంఖ్య ఎంతో ఎందుకు లెక్కలు తీయరు? బడ్జెట్‌లో వారికి ఎంత ఖర్చు చేస్తున్నారో ఆలోచించాలి. దేశంలో, రాష్ట్రంలో ఓబీసీలు 50శాతం వరకు ఉన్నారు. ప్రజల జేబు నుంచి డబ్బు సేకరించి అదానీ జేబులోకి పంపిస్తున్నారు. దొరల తెలంగాణకు.. ప్రజల తెలంగాణకు మధ్యనే ఈ ఎన్నికలు. తెలంగాణకు కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారు. పసుపు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తాం. ప్రజలతో మా పార్టీకి ఉన్నది ప్రేమ, అనుబంధం. కాంగ్రెస్‌కు, ప్రజలకు మధ్య ఉన్న అనుబంధం దశాబ్దాల నాటిది. నెహ్రూ, ఇందిర, రాజీవ్, సోనియా నుంచి ప్రజలతో మాకు అనుబంధం ఉంది. చిరువ్యాపారి వద్ద దోశ వేయడం చాలా సంతోషం కలిగించింది" అని రాహుల్ అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ విజయభేరి యాత్రలో భాగంగా జగిత్యాలకు వెళ్తూ మార్గమధ్యంలో NAC బస్టాప్ వద్ద ఆగిన రాహుల్ గాంధీ.. ప్రయాణికులతో ముచ్చటించారు. చిన్నారులకు చాక్లెట్స్ అందించారు. టిఫిన్ బండి వద్దకు వెళ్లి సరదాగా దోసెలు వేశారు.

# రాష్ట్రానికే తలమానికంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దుతాం: సీఎం కేసీఆర్



మేడ్చల్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారాస హ్యాట్రిక్ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తూంకుంటలో కన్వెన్షన్‌హాలులో గజ్వేల్ నియోజకవర్గ భారాస నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 95 నుంచి 100 అసెంబ్లీ స్థానాలు గెలవనున్నామని పార్టీ శ్రేణులకు చెప్పారు. రాష్ట్రానికే తలమానికంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఇకపై ప్రతి నెలలో ఒకరోజు గజ్వేల్ నియోజకవర్గానికి కేటాయిస్తానని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఒక్క నిరుపేద కూడా ఉండొద్దన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. గజ్వేలులో జరిగిన అభివృద్ధితో సంతృప్తి పడొద్దని.. చేయాల్సింది ఇంకా చాలా ఉందన్నారు. ఒక విడత మాత్రమే అభివృద్ధి పనులు జరిగాయి.. గజ్వేలులో రెండో విడతలో మరింత అభివృద్ధి పనులు జరుగుతాయని పేర్కొన్నారు. గజ్వేల్‌ను వదిలిపెట్టి పోయేది లేదన్నారు. తనను ఎంత మెజార్టీతో గెలిపిస్తారనేది ప్రజల దయ అన్నారు. కామారెడ్డిలో పోటీ చేయడానికి కొన్ని కారణాలు ఉన్నాయని పార్టీ నేతలకు వివరించారు. "గతంలో తెంగాణ నేతలకు టికెట్లు కేటాయించేటప్పుడు దారుణమైన పరిస్థితులు ఉండేవి. పార్టీ టికెట్ల కోసం పోయిన నేతలను చులకనగా చూశారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా నీటిబిందెల ప్రదర్శన ఉండేది. ఇప్పుడు ఎక్కడైనా రోడ్లపై బిందెలు కనిపిస్తున్నాయా? చివరికి అవమానాలు దిగమింగి.. అనేక పోరాటాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నాం. వలసపోయిన రైతులు మళ్లీ గ్రామాలకు రావాలనే లక్ష్యంతో పనిచేశాం. వ్యవసాయ స్థిరీకరణ జరిగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. సాగు ఖర్చుల కోసం రైతులకు డబ్బులు ఇవ్వాలనే ఆలోచన ఎవరికైనా వచ్చిందా? మిషన్ భగీరథకు స్ఫూర్తి సిద్దిపేటలో అమలు చేసిన తాగునీటి పథకమే" అని కేసీఆర్ వివరించారు.
కేసీఆర్‌తో పాటు సమావేశంలో మంత్రి హరీశ్‌రావు, ఒంటేరు ప్రతాపరెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వారికి సీఎం పదవి ఇస్తేనే తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి.. లేదంటే ఇక అంతే



న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే బడుగు బలహీన వర్గాల నుంచి సీఎం అభ్యర్థిని ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి సీఎం అభ్యర్థి ఉండాలన్నారు. బడుగు బలహీన వర్గాల నుంచి సీఎం అభ్యర్థిని ప్రకటించాలని మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ , రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు గోనె ప్రకాష్ లేఖ రాశారు. టికెట్ల కేటాయింపులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్‌లో పారాచుట్లకు స్థానం కల్పించారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారికి అన్యాయం జరుగుతోందని తెలిపారు. సీట్లు అమ్ముకున్నారని తాను అనడం లేదని.. సీట్ల వ్యవహారంలో గందరగోళం నెలకొందని ఆయన చెప్పుకొచ్చారు. సీట్ల కేటాయింపుపై నిజ నిర్ధారణ కమిటీ వేసి దర్యాప్తు జరపాలని కోరారు. అనేక సార్లు ఓడిపోయిన తుమ్మలకు కాంగ్రెస్ సీటు ఇస్తుందన్నారు. పొంగులేటి, తుమ్మల బీఆర్ఎస్‌లో గెలవలేక పోయారని.. కాంగ్రెస్‌లో ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్‌కు రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌ను కుటుంబ పాలన అనే అర్హత లేదన్నారు. బోథ్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు పోతాయని తెలిపారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి టికెట్లు ఇచ్చారన్నారు. టికెట్ల వ్యవహారం లో అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే కనుచూపు మేరలో కాంగ్రెస్ కనపడదన్నారు. బడుగు బలహీన వర్గాలకు సీఎం పదవి కేటాయిస్తే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని గోనె ప్రకాష్‌రావు పేర్కొన్నారు.

# రాహుల్‌తో భేటీ తర్వాత కోదండరాం సంచలన నిర్ణయం

కరీంనగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అనంతరం టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం సంచలన నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్‌తో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. శుక్రవారం కరీంనగర్ వి పార్క్‌లో రాహుల్‌తో భేటీ అనంతరం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో కోదండరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను గద్దె దించడానికి అనుసరించాల్సిన వ్యూహంపై రాహుల్ గాంధీతో చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల సర్దు బాటుపై మరోసారి సమావేశం అవుతామన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో భేటీ తర్వాత క్లారిటీ వస్తుందన్నారు. తమ లక్ష్యం నియంతృత్వ కేసీఆర్‌ను ఓడించడమే అని కోదండరాం స్పష్టం చేశారు. కాగా.. తెలంగాణ ప్రయోజనల కోసం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని జన సమితి నిర్ణయించింది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ బలహీనంగా ఉన్న ముథోల్, ఎల్లారెడ్డి, కోరుట్ల, జహీరాబాద్ స్థానాలను తెలంగాణ జనసమితి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ నియంత పాలన దించడానికే టీజేఎస్ ఏర్పడిందని కోదండరాం వెల్లడించారు.

# బీజేపీపై హరీష్‌రావు దుష్ప్రచారం

దుబ్బాక: దుబ్బాకకు నేనెప్పుడూ రుణపడి ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు తెలిపారు. శుక్రవారం నాడు దుబ్బాకలో పర్యటించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. "దుబ్బాకలో పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పించాం. బీజేపీపై



మంత్రి హరీష్‌రావు దుష్ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఒక్క కొలువు ఇవ్వలేదు.. కానీ కేసీఆర్ ఇంట్లో అందరికీ కొలువులే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్‌లో చేరడం ఖాయం. తెలంగాణలో మంచి కోసం, మార్పు కోసం.. బీజేపీకి ఒక్క అవకాశమివ్వాలి" అని రఘునందన్‌రావు పేర్కొన్నారు.

# బాసర క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు



ముథోల్(బాసర): బాసర అమ్మవారి క్షేత్రంలో మూలా నక్షత్రం వేడుకలు నిర్వహించారు. మూలా నక్షత్రం సందర్భంగా ఉదయం 3 గంటల నుంచి తల్లిదండ్రులు.. తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.
అదేవిధంగా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు 'కాత్యాయని' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిచారు.

# రేవంత్ తీరు హంతకుడే సంతాపం తెలిపినట్లుంది: కేటీఆర్

హైదరాబాద్: ఉద్యమ నేతలందరూ తిరిగి భారాసలో చేరుతున్నారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ భారాసలో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిట్టా బాలకృష్ణారెడ్డి తిరిగి స్వగృహానికి చేరుకున్నారన్నారు. ఆయన తొందరపడి 2009లో భారాస నుంచి వెళ్లిపోయారని.. ఇప్పుడు మళ్లీ రావడంతో తప్పిపోయిన కొడుకు తిరిగి ఇంటికి వచ్చినట్లుందని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల విమర్శలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కొందరు నేతలు మాయమాటలు చెప్పి మోసగించాలని చూస్తున్నారు. నోట్ల కట్టలతో దొరికిన రేవంత్.. డబ్బులు పంచబోను అని ప్రమాణం చేయాలంటూ సవాల్ విసురుతున్నారు. ఆయన తీరు హంతకుడే సంతాపం తెలిపినట్లుంది. కాంగ్రెస్ ఎన్నో బాధలు పెట్టి తెలంగాణ ఇచ్చింది. ఎన్నో పోరాటాలు చేసిన తర్వాతే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారు. తెలంగాణ ఇవ్వాల్సిన అనివార్య పరిస్థితిని కల్పించింది భారాసనే. సంక్షేమం, అభివృద్ధి నినాదాలతో ముందుకెళ్తున్నాం. తెలంగాణ కంటే ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం ఏదైనా ఉందా? మేం ఎవరికో బీ టీమ్ కాదు.. రాష్ట్ర ప్రజలకు ఏ టీమ్. ఎన్నికల్లో భాజపా, కాంగ్రెస్ చేష్టలు ఎవరికి తెలియవు? సోనియా, రాహుల్‌ను పలు రకాలుగా దూషించింది రేవంత్‌రెడ్డే. వందల మంది తెలంగాణ బిడ్డలను చంపింది కాంగ్రెస్ పార్టీయే. ఆ పార్టీ పెద్దలు ఎన్నో రకాలుగా తెలంగాణ ప్రజలను అవమానించారు. సోనియా బలిదేవత అన్నది ఎవరు.. రేవంత్ కాదా? బీసీ జనగణన చేయాలని గతంలోనే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బీసీ జనగణనను రాహుల్ ఎందుకు చేయించలేదు? ఈ 9 ఏళ్లలో తెలంగాణలో ఏం తక్కువైందో చెప్పాలి? 33 జిల్లాల్లో 33 వైద్య కళాశాలలు తెచ్చిన సీఎం మరొకరు ఉన్నారా? 9 ఏళ్లుగా రాష్ట్రంలో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నాం. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం అంటున్నారు.. మళ్లీ రూ.20 పింఛను ఇస్తారా?" అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి కేటీఆర్ అన్నారు.

# రజాకార్ సినిమా పేరుతో బీజేపీ నేతలు చరిత్రను వక్రదారి పట్టిస్తున్నారు



ఢిల్లీ : రజాకార్ సినిమాపై కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు, సెన్సార్ బోర్డుకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ( %జూ× ఛీుతీుఋుఋు% ) ఫిర్యాదు చేశారు. శుక్రవారం నాడు ఢిల్లీ వేదికగా నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. "రజాకార్ సినిమా పేరుతో బీజేపీ నేతలు చరిత్రను వక్రదారి పట్టిస్తున్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు మత విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి రజాకార్ సినిమాకు ఫైనాన్స్ చేశారు. రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణలో సాయుధ పోరాటం జరిగింది.
బీజేపీ సాయుధ పోరాటాన్ని విముక్తి పోరాటంగా చూస్తుంది. బీజేపి నేతలు ఇలాంటి ప్రయత్నాల వల్ల చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. రజాకార్ సినిమాని విడుదల కాకుండా నిలిపివేయాలి. రజాకార్ సినిమా విడుదలవుతే మత విద్వేషాలు రెచ్చగొట్టినట్లు అవుతుంది" అని నారాయణ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com